epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం


మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM


విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131


సంపుటి: 18 | సంచిక: 351 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 9 సెప్టెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |




## తాగునీటి కోసం మూసీ నదిని
# క్లీన్ చేస్తాం

### గోదావరితో హైదరాబాద్ నీటి గోస తీరుస్తాం



## వందరోజుల్లో మేడారం అభివృద్ధి పనులు

బాసర, మేడారం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


2

- ఎల్లంపల్లి శ్రీపాద నుంచి నీటిని తరలిస్తాం
- ఇది కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగం కానేకాదు
- మూసీ ప్రక్షాళనతో నల్లగొండకు ఊపిరి
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్లను నిర్మిస్తాం
- గోదావరి తాగునీటి సరఫరా పథకం శంకుస్థాపనలో సీఎం రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** తాగునీటి సమస్యలు పరిష్కరించడానికే పీజేఆర్ పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా.. ఉస్మాన్‌సాగర్ వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.7,360 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో గోదావరి ఫేజ్ 2, 3 పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గోదావరి నదీ జలాలను మూసీ నది, ఈసా నదిలో సమ్మేళనం చేసి నగర ప్రజల దాహార్తిని తీర్చుతాం. హైద్రాబాద్ నగరంకు ప్రపంచ దేశాల్లో గొప్ప పేరుంది. 1908లో నగర ప్రమాదాన్ని నివారించడానికి నిజాం సర్కార్ ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించారు. ప్రపంచంలోనే గొప్ప ఇంజినీర్లతో నిజాం సర్కార్ ఈ ప్రాజెక్టులు కట్టింది. దూరదృష్టితో ఆలోచించి ఈ ప్రాజెక్టులు కట్టడంతో నగర దాహం తీరుతోంది. నగరంలో జనాభా పెరుగుతోంది.

మిగతా 2 లో

## నేడే ఉపరాష్ట్రపతి
# ఎన్నిక




ఎన్‌డిఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్.. ఇండి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి
ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభం
సాయంత్రం 5 వరకు జరుగనున్న పోలింగ్
సాయంత్రి 6 నుంచి ఓట్ల లెక్కింపు.. వెంటనే ఫలితం ప్రకటన

4




## వైకాపా సభ్యులు ప్రజా తీర్పును
# గౌరవించాలి

### అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలి : స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నంబర్ వన్-అనకాపల్లి :** అసెంబ్లీ సమావేశాలకు హాజు కావడం ద్వారా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వైకాపా సభ్యులకు సూచి ంచారు. గెలిపించిన ప్రజలను వంచిం చడం తగదని అన్నారు. ఏపీ అసెంబ్లీ

మిగతా 5 లో



తలసరి ఆదాయంలో
## ఫస్ట్

బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి

.. వివరాలు 2లో



## బీజేపీ తెలంగాణ కమిటీ ప్రకటన

8మంది ఉపాధ్యక్షులుగా నియామకం

.. వివరాలు 2లో



## 21 నుంచి దసరా సెలవులు


అక్టోబర్ 3వ తేదీ వరకూ పాఠశాలలకు హాలీడేస్

.. వివరాలు 2లో

# స్మార్ట్ వైజాగ్‌కు ముందడుగు

### సీఎం చంద్రబాబు సమక్షంలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థతో జీవీఎంసీ కీలక ఒప్పందం

- విశాఖ అభివృద్ధికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థ రుణం
- మహానగర పాలక సంస్థకు రూ.498 కోట్ల భారీ రుణం



**అమరావతి:** విశాఖపట్నం అభివృద్ధి ప్రస్థానంలో ఒక చారిత్రాత్మక ముందడుగు పడింది. నగర మౌలిక వసతుల కల్పన కోసం విశాఖ మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ) తన సొంత ఆర్థిక పటిష్టతతో ఏకంగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి భారీ రుణం సాధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సోమవారం నాడు జీవీఎంసీ, ఐఎఫ్‌సీ ప్రతినిధులు ఈ కీలక రుణ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా నగర పాలక సంస్థలు ఆర్థికంగా స్వయంప్రతిపత్తి సాధించే దిశగా జీవీఎంసీ దేశానికే ఒక కొత్త మార్గాన్ని చూపింది.

మిగతా 5 లో



## భారీగా రద్దయిన
# నోట్లు పట్టివేత

2 లో

# ఏపీలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

### టీటీడీ ఇవోగా మరోమారు అశోక్ కుమార్ సింఘాల్
### జిఏడి కార్యదర్శిగా శ్యామలారావు నియామకం



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. టీటీడీ ఈఓ శ్యామలరావును బదిలీ చేసింది. ఆయన స్థానంలో టీటీడీ ఈఓగా అనిల్ కుమార్ సింఘాల్‌ను నియమించారు. గతంలోను సింఘాల్ టిటిడి ఇవోగా పనిచేశారు. మరోమారు ఆయనకు అవకాశం ఇవ్వడం గమనార్హం. ఇకపోతే శ్యామలరావును సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శిగా నియమించారు. గవర్నర్

మిగతా 5 లో



# పార్టీ నిర్ణయం మేరకే కవిత సస్పెన్షన్

అందరితో చర్చించిన తరవాతే నిర్ణయం

- కాళేశ్వరం నీరు వాడుకుంటూ బద్నాం చేస్తారా?
- మీడియా సమావేశంలో కేటీఆర్

3



# సీఎం ఇంటి కాంపౌండ్ కూల్చివేత

## అభ్యంతరం చెప్పని సీఎం, ఆయన కుటుంబ సభ్యులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారు. రోడ్డు విస్తరణలో భాగంగా సీఎం ఇంటి కాంపౌండ్‌ను అధికారులు కూల్చారు. ఇందుకు సీఎం అడ్డుచెప్పక పోగా.. ఒక్క మాట కూడా మాట్లాడలేదు. సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం అయిన కొండారెడ్డిపల్లిలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా అధికారులు ముఖ్యమంత్రి ఇంటి కాంపౌండ్‌ను కూల్చారు. ఇంటి చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్ మెఃత్తంను పడగొట్టారు. ఇందుకు సీఎం సహా ఆయన కుటుంబ సభ్యులు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా వైరల్ అయ్యాయి. విషయం తెలుసుకున్న జనాలు రేవంత్ రెడ్డిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి అందరికీ ఆదర్శం', 'సీఎం తల్చుకుంటే అక్కడ రోడ్డు వేయడాన్నే ఆపేవారు, కానీ ఆలా చేయలేదు', 'ప్రజల శ్రేయస్సే సీఎం కోరుకున్నారు' అని కామెంట్స్ చేస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై పరువునష్టం కేసు

## బీజేపీ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 8 :** సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా దాఖలైన పరువునష్టం దావా కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణ బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారంటూ రేవంత్‌రెడ్డి ప్రచారం చేయడంపై బీజేపీ పిటిషన్ దాఖలు చేసింది. గత నెలలో ఇదే విషయమై ఆ పార్టీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను బీజేపీ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. తాజాగా వాదనలు విన్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. రాజకీయపరమైన అంశాల్లో జోక్యం చేసుకోబోమని తేల్చి చెప్పింది. రాజకీయ నాయకులకు సున్నితమైన మనసు ఉండకూడదని పేర్కొంది. కోర్టులను రాజకీయ యుద్ధ క్షేత్రాలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది.

# 21 నుంచి దసరా సెలవులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లకు దసరా సెలవులను ప్రకటించింది. దసరా పండుగ నేపథ్యంలో సెప్టెంబర్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ పాఠశాలలకు సెలవులు ఇచ్చింది. అదే విధంగా జూనియర్ కాలేజీలకు సెప్టెంబర్ 28వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ సెలవులు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

# బీజేపీ తెలంగాణ కమిటీ ప్రకటన



## 8మంది ఉపాధ్యక్షులుగా నియామకం

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** బీజేపీ తెలంగాణ కమిటీని ప్రకటించింది. 8 మందికి వైస్ ప్రెసిడెంట్లుగా..ముగ్గురికి ప్రధాన కార్యదర్శులుగా అవకాశం ఇచ్చింది. వీరితో పాటు- 8 మందిని కార్యదర్శులుగా నియమించింది. ఒకరికి -ట్రెజరర్, మరొకరు జాయింట్ -ట్రెజరర్ గా నియమించింది. వైస్ ప్రెసిడెంట్లుగా బూరనర్సయ్య గౌడ్, కాశం వెంకటేశ్వర్లు యాదవ్, బండారి శాంతి కుమార్, జయశ్రీ, కొల్లి మాధవి, గోపి, రాఘునాథ్ రావు, బండ కార్తీక రెడ్డిలను నియమించారు. ఇక ముగ్గురు గౌతమ్ రావు, తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్ లను ప్రధాన కార్యదర్శులుగా నియమించింది. బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలిగా మేకల శిల్పా రెడ్డి, యువ మోర్చ అధ్యక్షురాలిగా గణేశ్ కుండె, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బస్వాపురం లక్ష్మీనర్సింహా, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా క్రాంతి కిరణ్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా నేనావత్ రవి నాయక్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా గంధమల్ల ఆనంద్ గౌడ్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా సర్దార్ జగన్మోహన్ సింగ్ ను నియమించింది.

# భారీగా రద్దయిన నోట్లు పట్టివేత



**హైదరాబాద్,సెప్టెంబర్ 8:** హైదరాబాద్ నగరంలో రద్దయిన పెద్ద నోట్లు- భారీ మెఃత్తంలో పట్టు-బడ్డాయి. నారాయణగూడ శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంక్ వద్ద ఇద్దరిని, వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఇద్దరిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 3 బ్యాగుల్లో తనిఖీలు చేయగా.. రూ.2 కోట్లు విలువ చేసే రద్దయిన 500, 1000 నోట్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# ఓటేయలేమని చెప్పడం విడ్డూరం

## ఉపరాష్ట్రపతి ఎన్నకకు బిఆర్ఎస్ దూరంపై ఎంపి చామల



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేయలేమని భారత రాష్ట్ర సమితి చెప్పడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే లోక్‌సభలో భారత రాష్ట్ర సమితికి సున్నా సీట్లు వచ్చాయని గుర్తు చేసిన ఆయన.. యూరియా ఇవ్వలేదు కాబట్టి ఎన్నికలకు దూరంగా ఉన్నాం, కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్రసమితిని ఇబ్బంది పెడుతోంది కాబట్టి ఎన్నికల్లో పాల్గొనడం లేదని ఉత్తుత్తి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండు విధాలుగా వారు ఎన్నికల్లో పాల్గొనకుండా ఉన్న విధానాన్ని తెలంగాణ ప్రజలు గమనించాలన్నారు. తెరాసగా ఆవిర్భవించి తెలంగాణ సెంటిమెంట్‌కు దూరంగా భారత రాష్ట్రసమితిగా పేరు మార్చినప్పుడే.. తెలంగాణ అంశాన్ని ఆ పార్టీ మర్చిపోయిందని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఏ పార్టీకీ చెందిన వారు కాదని, ప్రజాస్వామ్యం గురించి మంచి అవగాహన ఉన్న వ్యక్తికి ఓటు-వేయకపోవడం, ఎన్నికలకు దూరంగా ఉండటం చూస్తే లోక్‌సభ, రాజ్యసభలో కూడా భారత రాష్ట్ర సమితి అవసరం లేని పార్టీగా మారిపోయిందని ఎద్దేవా చేశారు.

# మూసీని క్లీన్ చేస్తాం.. నీటి గోస తీరుస్తాం

మొదటి పేజీ తరువాయి



ఉద్యోగాల కోసం హైదరాబాద్ వస్తున్నారు. నగర జనాభా కోటిన్నరకు చేరింది. పీజేఆర్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఖాళీ కుండలతో అసెంబ్లీ ముందు ధర్నాలు చేసి.. మంజీరా, కృష్ణా జలాలను హైదరాబాద్ తరలించారు. రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు శ్రీపాద ఎల్లంపల్లి నీటిని తరలించడానికి శంకుస్థాపన చేస్తే 2014 నుంచి నగరానికి వచ్చాయి' అని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రజలు చెప్పారని అన్నారు. సమస్యలు సృష్టించినా సమన్వయంతో ముందుకెళ్తున్నామన్నారు. తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎవరు అడ్డం వచ్చినా ఈ పథకం పూర్తి చేస్తాం. నల్గొండ ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం. ఈ పథకం ద్వారా హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారమే కాకుండా, నల్గొండ ఫ్లోరైడ్ సమస్య తీరుతుంది. భారత రాష్ట్ర సమితి వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరిగింది. మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలి. త్వరలో మహారాష్ట్రకు వెళ్లి అక్కడి సీఎంను కలుస్తామని సీఎం అన్నారు. నల్గొండ ప్రజల కోసమే మూసీ నదిని ప్రక్షాళన చేస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సబర్మతి, యమునా, గంగా నది ప్రక్షాళన జరగొచ్చు కానీ.. మూసీ నది ప్రక్షాళన జరగొద్దా? అని సీఎం ప్రశ్నించారు. రూ.7,360 కోట్లతో హ్యామ్ విధానంలో పనులు చేయనున్నారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. నల్లగొండ జిల్లాలో మూసీ నది కాలుష్యానికి మారు పేరుగా మారింది. ఆ నీరు త్రాగి పశువుల ప్రాణాలే కాదు మనుషుల ప్రాణాలు కూడా పోతున్నాయి. మూసీ నది నీటి వల్ల ఆడబిడ్డలకు పురిటి సమస్యలకు కారణం అవుతుంది. నల్లగొండ జిల్లాలో పర్యటించినప్పుడు అక్కడ పరిస్థితి చూసి మూసీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నా. హైదరాబాద్ నగరంలో డ్రైనేజీల నీరు, కంపెనీల కాలుష్యం మూసీలో కలవకుండా ఈ నిర్ణయం తీసుకున్నాను. ఆ నీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీలు పెట్టడం జరిగిందన్నారు. గేట్ వే ఆఫ్ డిల్లీ, గేట్ వే ఆఫ్ ముంబై ఉంది. ఇప్పుడు గేట్ వే ఆఫ్ హైదరాబాద్ కూడా ఉంటది. హైదరాబాద్ అభివృద్ధికి అందరూ కలిసి రావాలి. అందుకు మీ అందరి సహకారం కావాలి. రాబోయే రోజుల్లో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చేద్దాం. ఎవరు అడ్డుకున్నా మన ప్రభుత్వం తిప్పి కొడుతుందన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యం, పేద్దోళ్ల రాజ్యం. పేదోళ్లకు న్యాయం జరుగుతుందని అనుకుంటున్నాను. 2014 నుంచి బీఆర్ఎస్ ఒక్క చుక్క నగరానికి తీసుకు రావాలనే ఆలోచన చేయలేదని, తాము మరలా అధికారంలోకి వచ్చాక గోదావరి నీటిని తీసుకురావడానికి ప్రణాళికలు చేసి ముందుకెళ్తున్నామన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కట్టి 2 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అప్పట్లో ఐటీ- మంత్రిగా ఉన్న వ్యక్తి నగరానికి వచ్చే నీటిని నెత్తి మీద చల్లుకున్నాడు. ఆయన నీళ్ళు చల్లుకున్నంత మాత్రాన చేసిన పాపాలు ఎక్కడికి పోవు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే వివిధ ప్రాజెక్టుల నుంచి నగరానికి నీళ్లు తీసుకువచ్చారు. 2014 నుంచి ఒక్క చుక్క నగరానికి తీసుకురావాలనే ఆలోచన చేయలేదు. తిరిగి మేము అధికారంలోకి వచ్చాక గోదావరి నీళ్ళని తీసుకురావడానికి ప్రణాళికలు తయారు చేసి ముందుకెళ్తున్నాం. ఒక వ్యక్తి తాడిచెట్టు- లాగా పెరిగాడు కానీ ఏమి లాభం లేదు. గోదావరి జలాలు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా అంటున్నాడు. కానీ వాళ్ళు కట్టిన కాళేశ్వరం.. కూలేశ్వరం అయింది. శ్రీపాద ఎల్లంపల్లి మీ తాత ముత్తాతలు కట్టలేదు. గోదావరి జలాలు నగరానికి వస్తున్నాయంటే శ్రీపాద ఎల్లంపల్లి మూలం. కాకా సూచన మేరకు ప్రాణహిత చేవెళ్లకు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుగా అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి నామకరణం చేశారు. చేవెళ్లలో రాజశేఖర్ రెడ్డి వేసిన శిలాఫలకం లేదా. కానీ దాన్ని ఆపి రంగారెడ్డి జిల్లాకు అన్యాయం చేశారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు దగ్గర 152 మీటర్ల ఎత్తులో కడతాం అని అడిగాం. 149 మీటర్లకు ఒప్పుకున్నారు. గోదావరి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కట్టి 2 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం. చేవెళ్ల, పరిగి, వికారాబాద్ కు నీళ్ళు తీసుకువస్తామని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.




# ఆర్థిక సంక్షోభం సృష్టించిన ఘనుడు కేసీఆర్

## రాష్ట్రాన్ని నాశనం చేసిన బీఆర్ఎస్.. మేడిగడ్డ కుంగిందని చెబితే ఎదురుదాడి

## టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో భట్టి విక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణలో ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వంపై భట్టి విక్రమార్క మరోసారి నిప్పులు చెరిగారు. పాలన పరంగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ నాశనం చేసిందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మేడిగడ్డ అంశంపై తాము మాట్లాడితే.. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని తెలిపారు. మేడిగడ్డ కుంగిందని వాస్తవాలు చెప్పిన కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ నేతలు తప్పుపడుతున్నారన్నారు. హరీష్ రావు, సంతోష్ రావులు కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో దోచుకోవడం వల్లే.. కేసీఆర్ రెండో సారి తన కేబినెట్‌లో హరీశ్ రావును అవకాశం ఇవ్వలేదని ఆయన వివరించారు. తెలంగాణలో పాలనతోపాటు- ఆర్థిక పరంగా గాడిన పెడుతున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ కార్యక్రమం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి రాగానే రుణ మాఫీ చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు- రైతు భరోసా కింద ఇచ్చామన్నారు. దేశంలోనే రైతులకు ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ చేసిందని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. దాదాపు రూ. లక్ష కోట్లు- సంక్షేమ కోసం ఖర్చు చేసిందన్నారు. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ కుల గణన చేస్తామన్నారని.. ఆ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన చేసి చూపించామని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇక స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల కోసం బిల్లులు తీసుకొని వచ్చామన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. రిజర్వేషన్లకు ముకుతాడు వేసిందని విమర్శించారు. ఎల్లంపల్లి, నెట్టెంపాడు ,శ్రీశైలం, నాగార్జున సాగర్, దేవాదుల ప్రాజెక్టులు మనమే నిర్మించామని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి చాలా అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. అందరం కలిసికట్టు-గా పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వ పదవిలో ఏదో ఒకటి తప్పకుండా వస్తుంది. కాంగ్రెస్ పార్టీ అజేయంగా ఉండేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేపట్టే ప్రతి పనికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు- కేబినెట్ అంతా అండగా ఉంటుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించేందుకు, సవాళ్లను ఎదుర్కొని న్యాయం చేసేందుకు ముందుకు వెళ్తున్నాం. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితిని భారత రాష్ట్ర సమితి పెట్టింది. 42 శాతం రిజర్వేషన్ బిల్లును భాజపా రాష్ట్రపతి దగ్గర ఆపింది. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి, భాజపా కుట్ర దాగి ఉందని భట్టి విమర్శించారు.

# ఏసీబీకి పట్టుబడ్డ ఆర్ఐ అమర్నాథ్ రెడ్డి



**మద్దూరు,సెప్టెంబర్ 8:** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం మద్దూరు మండలంలోని అప్పిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఒక రైతుకు సంబంధించి ఐదు గుంటల పొలాన్ని పాస్బుక్లో ఎంట్రీ చేసేందుకు 5000 రూపాయల లంచం డిమాండ్ చేశాడు ఆ రైతు ఎంత వేడుకున్న ఆర్ ఐ వినకుండా డబ్బులు ఇస్తే గాని పని జరగదు అని తేల్చి చెప్పాడు. తప్పని పరిస్థితుల్లో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు సోమవారం పక్కా ప్రణాళికలతో మహబూబ్ నగర్ ఏసీబీ, డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో వారి సిబ్బంది కలిసి లంచం డబ్బులను పట్టుకొని ఆర్ ఐ ని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కార్యాలయంలో మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు.

# వందరోజుల్లో మేడారం అభివృద్ధి పనులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** మేడారం, బాసర ఆలయాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని, ఈ వారంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని అధికారులకు చెప్పారు. జాతరకల్లా సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. మేడారం, బాసర ఆలయాల అభివృద్ధి ప్రణాళికలపై సీఎం రేవంత్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మేడారం అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. మేడారం మహాజాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ప్రవేశం, బయటకు వెళ్లే దారి, పార్కింగ్ తదితర ఏర్పాట్లు- ఉండాలి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలి. బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధిలో స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సీఎం దిశానిర్దేశంచేశారు. ఈ సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తలసరి ఆదాయంలో తెలంగాణ ఫస్ట్

## వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో ముందంజ

## బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి

**హైదరాబాద్,సెప్టెంబర్ 8 :** తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ అని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో తెలంగాణ తొలి స్థానంలో ఉందని చెప్పారు. కర్ణాటక, హరియాణాను అధిగమించి తెలంగాణ రికార్డు సాధించిందని పేర్కొన్నారు. వార్షిక రుణ ప్రణాళికలో రాష్ట్రం మొదటి క్వార్టర్‌లోనే 33.64 శాతం సాధించింది. ఇందిరమ్మ ఇళ్లకు, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు ఇవ్వాలి. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వండి. ఆస్తుల తాకట్టు-, ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో రైతులను ఒత్తిడి చేయవద్దన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావిస్తున్నాం. అన్నదాతల పక్షాన రుణమాఫీ, రైతఃభరోసా పేరిట బ్యాంకులకు రుణాలు జమ చేశాం. రూ.30 వేల కోట్లు- రైతుల పక్షాన బ్యాంకులకు రాష్ట్రప్రభుత్వం జమ చేసింది. బ్యాంకింగ్ రికవరీ చరిత్రలో ఇది ఒక రికార్డు అని భట్టి విక్రమార్క తెలిపారు.

# తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణం

- డీపీఆర్, ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- మహారాష్ట్రతో చర్చల కోసం షెడ్యూల్ ఖరారు
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తుమ్మిడిహట్టి కోసం సవరించిన డీపీఆర్, ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మహారాష్ట్రతో చర్చల కోసం షెడ్యూల్ ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఉత్తమ్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల భద్రత, వినియోగాన్ని నిర్ధరించేందుకు వర్షాకాలం ముందే చర్యలు తీసుకుంటున్నట్లు- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అన్ని ప్రాజెక్టుల్లో దశలవారీగా పూడికతీతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉత్తమ్ సూచించారు.సమ్మక్క-సారక్క ఆనకట్ట విషయంపై ఈ నెల 23న టీఏసీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నివేదిక సమర్పించడంతోపాటు- ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ కోసం ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. పీఎంకేఎస్‌వై పథకం ద్వారా నిధుల కోసం కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణలో ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం ముందుకెళ్తామని అన్నారు. వరద తగ్గిన వెంటనే ఐఐటీ-లాంటి సంస్థలతో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. పాలమూరు, రంగారెడ్డి, జూరాల, కల్వకుర్తి ప్రాజెక్టులను ప్రాధాన్యంగా పరిగణించాలి. 4 ప్రాజెక్టుల భూ సేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలి. డిండి, ఎస్ఎల్‌బీసీ, పెండ్లిపాక, నక్కలగండి, కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. భూసేకరణ వేగవంతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. దేవాదుల ప్రాజెక్టు 3, 6 ప్యాకేజీల పనులు వేగవంతం చేయాలి. తదుపరి కేబినెట్ సమావేశానికి పురోగతి నివేదిక సమర్పించాలి. మరోవైపు ఎస్ఎల్‌బీసీ పనుల కోసం హెలిబోర్న్ సర్వే విషయంపై ఎన్జీఆర్ఐ, హిమాలయన్ హెలీ సర్వీసెస్, జేపీ అసోసియేట్స్ ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ వద్ద 2 హెలిప్యాడ్‌లను సర్వే కోసం ఉపయోగించు కోవచ్చని అధికారులు తెలిపారు. డీజీసీఏ, ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధ్యయనాలు కొనసాగించాలన్నారు.




## అందుబాటులోకి కోకాపేట్
# నియోపోలీస్ ట్రంపెట్

### లంఛానయనిగా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్ 8 :** కోకాపేట వద్ద నియో పోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్‌ను సోమవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హెచ్ఎండీఏ నిర్మించిన నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాన్ని ఔటర్ రింగ్ రోడ్డుకు కనెక్ట్ చేస్తూ ట్రంపెట్‌ను నిర్మించారు. నియో పోలిస్ ప్రాంతంలో భారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులు నిర్మితమవుతున్నాయి. దీంతో నియోపోలిస్, కోకాపేట ప్రాంతంలో భారీగా ఐటీ- కంపెనీలు తరలి రానున్నాయి. ఫ్యూచర్ ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ ట్రంపెట్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ ట్రంపెట్ జంక్షన్‌తో మోకిల, శంకర్‌పల్లి ప్రాంతాలకు ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి. నియో పోలిస్ నుంచి ట్రంపెట్ ద్వారా 20 నిమిషాల్లో ఎయిర్ పోర్ట్ చేరుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అలాగే నియోపోలిస్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలికి ఈజీగా కనెక్టివిటీ- ఉంటుందని పేర్కొంటు-న్నారు. ఓఆర్ఆర్‌కు కనెక్ట్ చేసేందుకు నియోపోలిస్ వద్ద ట్రంపెట్‌కి రెండు చోట్ల టోల్ గేట్స్ ఏర్పాటు చేశారు. ఈ నియో పోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో.. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితోపాటు- పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. కోకాపేట వద్ద నియో పోలీస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్థానికులు కలిసి అభినందనలు తెలిపారు. దీంతో ఆయన వారికి అభివాదం తెలిపారు.

# మహిళా ఆర్చర్ చికితకు అభినందన



**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** మహిళా ఆర్చరీ ఛాంపియన్ చికిత తనిపర్తిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చికిత తనిపర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. కెనడాలో జరిగిన 2025 యూత్ వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున బంగారు పతకం గెలుచుకున్న తొలి మహిళగా చికిత తనిపర్తి రికార్డు సృష్టించారు. ఈ నేపథ్యంలో సీఎంను ఆమె కలిశారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించేందుకు ప్రభుత్వం తరపున పూర్తి శిక్షణ అందించేందుకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని చికితకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల చైనాలోని షాంఘైలో జరిగిన సీనియర్ వరల్డ్ కప్ జట్టు- రజత పతకాన్ని ఆమె సాధించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ రమణారావు, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, రాజేందర్ రావు తదితరులు చికిత వెంట ఉన్నారు.



# కేంద్రం కావాలనే
# యూరియా కుట్రలు

### బీజేపీతో బీఆర్ఎస్ లోపాయకారి మద్దతు
### రైతులు ఆందోళన చెందుతున్నా కేంద్రం రాజకీయం
### మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** కేంద్రప్రభుత్వం యూరియా ఇవ్వలేదని, అందుకే సమస్యలు వస్తున్నాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే యూరియా కొరత వచ్చిందని ఆరోపించారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావుకి ఎరువుల గురించి ఏమీ తెలియదని విమర్శించారు. రాంచందర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. ఆయనకు రాజకీయ విమర్శలు తప్పా, రైతుల సమస్యలు పట్టవా? అని ప్రశ్నించారు. యూరియా కోసం ఎప్పుడైనా కేంద్ర ప్రభుత్వాన్ని అడిగారా..? అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డితో సహా మంత్రులు, ఎంపీలు యూరియాపై కేంద్ర ప్రభుత్వం పెద్దలను కలసి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. యూరియా ఉత్పత్తి, సరఫరా కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందని చెప్పుకొచ్చారు. సోమవారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు పాజిటివ్‌గా ఉన్నారని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని.. దాన్ని ఆసరాగా చేసుకుని బీజేపీ, బీఆర్ఎస్‌లు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఆపేశారని గుర్తుచేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు యూరియా కొరతకు బాధ్యత వహించాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. యూరియా సమస్యను పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల అంశంపై సంబంధిత కేంద్ర మంత్రి స్పందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కాంగ్రెస్ పార్టీ తరఫున పోరుబాట పడుతామని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఎరువుల కొరతతో రైతులు ఆందోళనలో ఉన్నారని మంత్రి తెలిపారు. ఎరువుల విషయంలో తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని అన్నారు. ఎరువుల తయారీ, సరఫరాపై పూర్తి ఆధిపత్యం కేంద్రానిదే అని రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత రావాలనేది ఉద్దేశం కాదని చెప్పారు. బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కయి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎరువుల సమస్య ఉందనేది వాస్తవం అని పేర్కొన్నారు. ఎరువుల బాధ్యత వహించాల్సిన వాళ్లు నిమ్మకు నీరెత్తినట్లు- ఉన్నారని, క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఏమీ లేదని అన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉద్దేశపూర్వకంగా 4 నెలలుగా ఉత్పత్తి జరగట్లేదని విమర్శించారు. రామగుండం కర్మాగారం ఉత్పత్తి చేసి ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని, రాష్ట్రానికి 11 లక్షల టన్నులకు గాను 5.2 లక్షల టన్నుల ఎరువులే వచ్చాయని తెలియజేశారు. ఎరువుల వైఫల్యం బాధ్యత బిజెపి తీసుకోవాల్సిందేనని రాజకీయ కక్ష ఉంటే రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై తీర్చుకోవాలని సూచించారు. రైతుల సహకారంతో బిజెపికి వ్యతిరేకంగా ఒత్తిడిని తెస్తామని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు- ఎటువైపో చెప్పాలని పొన్నం ప్రభాకర్ బిఆర్ఎస్‌కుప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంపై బీజేపీ , బీఆర్ఎస్ కుమ్మక్కై కుట్ర చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

## పార్టీ నిర్ణయం మేరకే
# కవిత సస్పెన్షన్

### అందరితో చర్చించిన తరవాతే నిర్ణయం
### కాళేశ్వరం నీరు వాడుకుంటూ బద్నాం చేస్తారా
### మీడియా సమావేశంలో కేటీఆర్ విమరంశలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** మాజీ ఎమ్మెల్సీ కవితను పార్టీ బిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయమని వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అన్నారు. అందరితీఓ చర్చించి తీసుకున్న నిర్ణయమని అన్నారు. సస్పెన్షన్ చేసిన తర్వాత కవిత తన ఎమ్మెల్సీ పదవికి, పార్టీ ప్రధాన సభ్యత్వానికి కూడా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై కవిత సోదరుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తొలిసారిగా స్పందించారు. తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీలో చర్చించిన తర్వాతే పార్టీ అధినేత కేసీఆర్ ఆ నిర్ణయం తీసుకున్నారని కెటిఆర్ స్పష్టం చేశారు. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత కవిత ప్రెస్‌మీట్ పెట్టి హరీశ్‌రావు, సంతోష్‌లను టార్గెట్ చేస్తూ.. ఆరోపణలు చేశారు. హరీశ్, సంతోష్‌లు పక్కన ఉంటారు కానీ తెలంగాణ గురించి, కెటిఆర్ గురించి ఆలోచించే వ్యక్తులు కాదని కెటిఆర్‌కు సూచించారు. వాళ్లను పక్కనపెడితే పార్టీ బతుకుతుందని, తన తండ్రి పేరు నిలబడుతుందని ఆమె అన్నారు. అయితే తాజాగా తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కేటీఆర్‌ను కవిత గురించి ప్రశ్నించారు. దీనికి ఆయన కవిత చేసిన వ్యాఖ్యలపై పార్టీలో చర్చించిన తర్వాత అధినేత నిర్ణయం తీసుకున్నారని.. ఇంకా ఆ విషయంలో స్పందించడానికి ఏమీ లేదని చెప్పారు. దీంతో పాటు ఉప రాష్ట్రపతి ఎన్నికలకు కూడా తమ పార్టీ దూరంగా ఉంటుందని కెటిఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టే సిబిఐకి కాళేశ్వరం కేసు అప్పగించారని తెలిపారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఏమీ తేల్చలేదని కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. కాళేశ్వరం నీటిని వాడుకుంటూ ప్రాజెక్టును బద్నాం చేస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేసినందుకు ప్రజలకు సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని అన్నారు. కొండపోచమ్మ నుంచి గ్రావిటీ- ద్వారానే గండిపేటకు నీరు వస్తుందని, మూసి ప్రాజెక్టులో విడతల వారి దోపిడి జరుగుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి ఎన్నికల తర్వాత ఉచిత మంచినీటి పథకాన్ని ఎత్తి వేస్తారని ఎద్దేవా చేశారు. యూరియా ఇచ్చిన వారికి ఓట్లు- వేస్తామని చెప్పామని, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థుల్లో ఇద్దరు మంచివారని కెటిఆర్ తెలియజేశారు. కానీ వారు కాంగ్రెస్ బిజెపి తరపున పోటీ- చేస్తున్నారని, బిజెపి కాంగ్రెస్ రైతులను వేధింపులకు గురిచేస్తున్నాయని అన్నారు. నోటా లేదు కాబట్టి ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉంటున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ లో చేరానని కడియం శ్రీహరి కూడా చెప్పారని.. ఇంకా విచారణ ఏముంది? అని వారితో సిఎం సమావేశం పెట్టడం ద్వారా ఏం సందేశం ఇస్తున్నారని కెటిఆర్ ప్రశ్నించారు.

### చర్లపల్లిలో భారీగా డ్రగ్స్ పట్టివేత సిగ్గుచేటు

మహారాష్ట్ర పోలీసులు వచ్చి 12 వేల కోట్ల రూపాయల డ్రగ్స్ ను పట్టుకుంటే తెలంగాణ పోలీసులు, ఇంటెలిజెన్స్, ఈగిల్, హైడ్రాలు ఏం చేస్తున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 12 వేల కోట్ల డ్రగ్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముడుపులు ముట్టాయా అని నిలదీశారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి, ఇక్కడి కంపెనీలో కార్మికులుగా చేరి, నెలల తరబడి పనిచేసి అక్కడ డ్రగ్స్ తయారు చేస్తున్నారని నిర్ధారించారని కేటీఆర్ తెలిపారు. ఆ తర్వాత నీకు, పోలీసులకు సమాచారం లేకుండా 12 వేల కోట్ల రూపాయల డ్రగ్స్ పట్టుకున్నారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా తెలంగాణ పోలీసులు, ఇంటెలిజెన్స్, ఈగిల్, హైడ్రాలు ఏం చేస్తున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. 21 నెలల నుంచి ఆ డ్రగ్స్ కంపెనీపై ఎటువంటి చర్యలు తీసుకోలేదంటే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమైనా ముడుపులు ముట్టాయా అని నిలదీశారు. ఇంత మొత్తంలో డ్రగ్స్ దొరకడం భారతదేశంలోనే ఇది రెండో ఘటన అని కేటీఆర్ తెలిపారు.

# మొసలి కన్నీరు కార్చడంలో కేటీఆర్ దిట్ట

### ములుగు ఘటనపై మంత్రి సీతక్క ప్రకటన



**హైదరాబాద్,సెప్టెంబర్ 8:** ములుగు మల్టిపర్పస్ వర్కర్ మైదం మహేశ్ జీతం ఆలస్యానికి ప్రభుత్వానికి సంబంధం లేదని, జీతాన్ని ప్రాసెస్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరిని విధుల్లోంచి తొలగించామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మైదం మహేశ్ మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం కేటీఆర్ వాడుకుంటు-న్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ హయాంలో పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు రాక సమ్మెలు చేసిన రోజులు ప్రజలు మరిచిపోలేదని అన్నారు. సిరిసిల్ల నుంచి సిద్దిపేట దాకా కలెక్టరేట్ల ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసనలు చేస్తే పట్టించుకోని కేటీఆర్ ఇవాళ మొసలి కన్నీరు కారుస్తున్నారని చెప్పారు. వేలాది పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల్లాగే ప్రతి నెల జీతాలు చెల్లిస్తున్నామన్నారు. ఇందుకోసం గ్రీన్ ఛానెల్ విధానాన్ని ప్రవేశపెట్టి, జీతాలు ఆలస్యం కాకుండా సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడు జీతం వస్తుందో తెలియని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. మైదం మహేశ్ జీతం ప్రాసెస్ చేయడానికి కారకులైన పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశామని, బిల్ కలెక్టర్ ను విధుల్లోంచి తొలగించామని, అదే విధంగా మహేశ్ కుటు-ంబానికి ఆర్థిక సాయం కూడా అందించామని చెప్పారు. ములుగు నూతన మున్సిపాలిటీగా ఏర్పా-టైయ్యిందని, ఈ క్రమంలో పంచాయతీ పద్దు నుంచి మున్సిపాలిటీ శాఖలోకి కార్మికులను మార్చి జీతాల చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

# మున్నేరుకు ఇరువైపులా కరకట్టలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 8 :** మున్నేరు ముంపు బాధితులకు ఇబ్బంది లేకుండా కరకట్టలు నిర్మించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల సమన్వయంతో కరకట్టలు నిర్మించాలన్నారు. నీటిపారుదల, ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఖమ్మం మున్నేరు కరకట్టల నిర్మాణం, కేబుల్ వంతెన నిర్మాణాలపై ఆరా తీశారు. ఏప్రిల్ చివరి నాటికి కేబుల్ వంతెన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రూ.180 కోట్ల వ్యయంతో కేబుల్ వంతెన నిర్మాణం, రూ.690 కోట్లతో మున్నేరు కరకట్టల నిర్మాణం చేపట్టినట్లు- తెలిపారు. మున్నేరుకు రెండువైపులా ఏకకాలంలో కరకట్టలు నిర్మించాలన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై ముందే చెప్పాం

### బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 8:** బీసీ రిజర్వేషన్లపై లీగల్ సమస్యలు వస్తాయని ముందే చెప్పామని బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. న్యాయ నిపుణులను ముందు సంప్రదించారా? అని రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ఎక్కడ అడ్డుపడింది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేయలేక తమపై నెపం వేయవద్దని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బిజెపికి అధికారం ఇస్తే బిసిల 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తెలియజేశారు. కాంగ్రెస్‌కు చిత్త శుద్ధి లేకుండా తమపై నిందలు వేస్తున్నారని రాంచందర్ ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజలను కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరుతో ద్రోహం చేసిందని ఆరోపించారు. తెలంగాణ బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తుందని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా కామారెడ్డి గడ్డ మీద మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.3వేల కోట్లు ఆగిపోయాయని చెప్పారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు రాజ్‌నాథ్ సింగ్ వస్తున్నారని, అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

## సంపాదకీయం



# లక్ష్యం చేరని సంపూర్ణ అక్షరాస్యత

ఏ దేశమైనా అక్షరాస్యతను కలిగివుంటేనే అభివృద్ధి చెందుతుంది. దేశంలో నిరక్ష్యరాస్యతను తొలగించిన నాడే పురోగమిస్తుంది. ప్రతి ఏటా సెప్టెంబర్ 8వ తేదీని 'అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే సంపూర్ణ అక్షరాస్యత విషయంలో కేంద్ర,రాష్ట్రాలు ఇంకా పూర్తిస్థాయిలో కృషి చేయడం లేదు. గ్రామాల వారీగా అక్షరాస్యతకు కృషి చేయడం లేదు. నవంబర్ 17, 1965 సంవత్సరంలో యునెస్కో సభ్యదేశాల విద్యాశాఖ మంత్రుల మహాసభ అనంతరం అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రకటించగా 1966 నుండి జరుపుకుంటున్నాం. అక్షరాస్యత అంటే సాంప్రదాయకంగా భాషను ఉపయోగించేందుకు అవసరమైన చదవటం, రాయటం, వినటం, మాట్లాడటం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసుకోవటాన్నే అక్షరాస్యత అనవచ్చు. అయితే మనిషి దైనందిన జీవితంలో ఈ రాయడం, చదవటం మాత్రమే అక్షరాస్యత అనేది కాదనీ, అక్షరాస్యత అంటే మనిషి గౌరవం, అవకాశాలు, అభివృద్ధి గురించి చెప్పడమే నిజమైన అక్షరాస్యత అని కొంతమంది పెద్దలు చెబుతుంటారు. ఉన్నతమైన జీవనానికి ప్రపంచం అన్నిరంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరం. అయితే ప్రపంచంలో కొన్ని దేశాలు వెనుకబడి ఉండడానికి నిరక్షరాస్యత ముఖ్యకారణం. అలా వెనకబడిన దేశాలను ముందుకు తీసుకురావడానికే అక్షరాస్యతను శాతాన్ని పెంచాలి. ఇది పిల్లల్లోనే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరించబడింది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం అగాధంలో వున్నట్లే చెప్పవచ్చు. ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే దానిక్కారణం కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుండటం తప్ప మరోటి కాదు. అనేక రాష్ట్రాలు సగటు అక్షరాస్యతా శాతానికి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మొత్తం మీద ప్రపంచ నిరక్షరాస్యుల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. గతంలో వయోజన విద్యకు ప్రాధాన్య ఇచ్చేవారు. ఈ మధ్య అది కనిపించడం లేదు. ప్రతి ఒక్కరిని అక్షరాస్యులను చేయాలన్న సంకల్పం యేరకు గ్రామస్థాయిలో సర్వేచేసి పిల్లలను బలవంతంగా స్కూళ్లకు చేర్చారు. అలాగే పనిప్రదేశాల్లో బాలకార్మికులను లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలన పెంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, కేవలం అక్షరజ్ఞానం కలిగించేలా చూడాలి. ఏటా ఉత్సవాలు జరపడంతో పాటు చేస్తున్న కృషికి అనుగుణంగా అక్షరాస్యత పెరిగిందా లేదా అన్నది బేరీజు వేసుకోవాలి.స్థిరమైన ఆర్థికాభి వృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 79ఏళ్లు గడుస్తున్నా సంపూర్ణ అక్షరాస్యతను సాధించలేదు. అందరూ చదివినప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం అగాధంలో వున్నట్లే చెప్పవచ్చు.ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే దానిక్కారణం కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుండటం తప్ప మరోటి కాదు. ప్రపంచ నిరక్షరాస్యు ల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. ప్రధానగా విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్రాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ కేటాయింపును తగ్గించే స్తున్నాయి. జనాభాకు అనుగుణంగా విద్యారంగ అభివృద్ధి జరగడం లేదు. విద్యారంగంలో విప్లవం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా..మార్పులు మాత్రం కానరావడం లేదు. ఎందుకనో పాలకులు ఎవరు అధికారంలో ఉన్నా ఈ రంగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫీజుల దోపిడీపై గళమెత్తు తున్నా పట్టించుకోవడం లేదు.కార్పొరేట్ స్కూళ్ల పేరుతో చేస్తున్న దోపిడీ అంతాఇంతా కాదు. తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక పట్టాలకెక్కడం లేదు. ఎపిలో జగనన్న విద్యా కానుక తప్ప స్కూళ్ల బలోపేతం జరగలేదు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదివిన వారు మత్రమే టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో గమనించాలి. దీనివెనక ఏదైనా గూడుపుఠాణి ఉందా అన్నది బయటపెట్టాలి. ప్రభుత్వ రంగంలో ప్రాథమిక విద్యకు బలమైన పునాదులు పడాలి. అలాగేకార్పోరేట్ దోపిడీని అరికటటాలి. అప్పుడే విద్యారంగం విస్తృతం కాగలదు. సామాన్యుడి నుంచి, రాజకీయనాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యావిధానంలో చదవాలన్న ఆకాంక్ష అమలు కావడం లేదు. విద్యాభివృద్ధిలో కులరహిత హాస్టళ్లు ఉండకూడదు. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుదున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. అయితే ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉండగానే గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, అనేక హాస్టళ్లను కొత్తగా చేప్టటడం వల్ల సమగ్ర విద్యాపథకం అటకెక్కిందనే భావించాలి. సమగ్రమైన విద్యతో పాటు, విద్యార్థి అన్ని రంగాల్లో రాటుదేలేలా విద్యా సంస్కరణలు రావాలి. ప్రతి ఒక్కరూ చదవడం,రాయడం లక్ష్యంగా ముందుకు సాగాలి. కనీసం పేపర్ చదవగలిగేలా చేయాలి. ఇంటర్‌నెట్ విస్తృతి పెరిగినా ప్రభుత్వ ప్రోత్సాహం దక్కడం లేదు. అయితే గతంతో పోలిస్తే విద్యారంగం లో అనేక విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. గురుకులాల ఏర్పాటు వల్ల సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి వచ్చింది. దానిని కాదనలేం. అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. గురుకుల విద్యాలయాలు పెరిగాయి. ఒక్కొక్క విద్యార్థిపై ఏటా ఒక లక్ష రూపాయలు వెచ్చిస్తున్నారు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు లభిస్తున్నాయి. చదువుకుంటే నిరుద్యోగిగా మిగిలిపోతున్న ప్రస్తుత తరుణంలో ఉపాధికి తగ్గ చదువు దక్కేలా చేయాలి.చిత్తశుద్ధి ఉంటే తప్ప విద్యారంగాన్ని మార్చలేం. అందరికీ విద్య అన్నది ప్రాథమిక హక్కుగా ఉన్నా, ఆచరణలో సాధ్యం కావడంలేదు. దీనిని ఆచరణలోకి తీసుకుని వచ్చేలా చర్యలు తీసుకుంటే తప్ప సంపూర్ణ అక్షరాస్యత సాధ్యం కాదు.

# నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

- ఎన్‌డీఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్.. ఇండి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి
- ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభం
- సాయంత్రం 5 వరకు జరుగనున్న పోలింగ్
- సాయంత్రి 6 నుంచి ఓట్ల లెక్కింపు..వెంటనే ఫలితం ప్రకటన





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి మంగళవారం ఎన్నిక జరుగనుంది. ఈ మేరకు ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. పార్లమెంటు ఉభయసభల సభ్యులుగా ఉన్నవారు మంగళవారం జరిగే ఎన్నికలో ఓటేస్తారు. ఈ ఎన్నకలను తెలంగాణకు చెందిన బిఆర్ఎస్ బహిష్కరించింది. అలాగే ఒడిషాకు చెందిన బిజూ జనతా దళ్ కూడా ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంది. పాలక ఎన్‌డీఏ తరపున మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67), విపక్ష 'ఇండీ' కూటమి నుంచి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి (79) పోటీచేస్తున్నారు. అన్ని పార్టీల ఎంపీలూ ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. ఈ ఎన్నికకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. పార్లమెంటు భవనంలోని వసుధలో ఎఫ్-101 గదిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు ఓట్లు- లెక్కించి ఫలితం ప్రకటిస్తారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆయా పార్టీల మద్దతు కోరిన సుదర్శన్‌రెడ్డి కూడా దేశ రాజధానికి వచ్చేశారు. తాను ఏ పార్టీ తరపునా పోటీ చేయడం లేదని, రాజకీయాలకతీతంగా తనకు ఓటు వేయాలని ఆయన ఉభయ సభల ఎంపీలకు లేఖ రాశారు.తమ ఎంపీలు ఓట్లు సక్రమంగా వేసేందుకు వీలు కల్పిస్తూ రెండు కూటములూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేశాయి. బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ అధినాయకత్వం తలపెట్టిన రెండ్రోజుల వర్క్‌షాప్ ఆదివారం ఢిల్లీలో మొదలైంది. ప్రధాని మోదీ దీనికి హాజరయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఎన్‌డీఏ ఎంపీలతో కలిసికట్టుగా వ్యూహరచనకు దిగారు. ఇక విపక్ష ఎంపీలకు కాంగ్రెస్ సోమవారం మధ్యాహ్నం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో మాక్‌పోల్ నిర్వహించి.. ఓటు ఎలా వేయాలో వివరించారు.ఉభయసభల్లో ఎన్‌డీఏకే సంఖ్యాబలం ఉంది. రెండు సభల్లో మొత్తం 788 మంది సభ్యులకు గాను ప్రస్తుతం 781 మందికి గాను లోక్‌సభలో 542, రాజ్యసభలో 239 మంది ఉన్నారు. ఎన్‌డీఏకి 425 మంది, ఇండీ కూటమికి 311 మంది, ఇతర ప్రతిపక్షాలకు 45 మంది సభ్యులున్నారు. ఇతర ప్రతిపక్షాల్లో వైసీపీ (11).. ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. బీజేడీ (7) మద్దతు కోసం ఆ పార్టీ అధినేత, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు ప్రధాని మోదీ స్వయంగా ఫోన్ చేశారు. సరైన సమయంలో తమ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని బీఆర్ఎస్ ఎంపీ కె.సురేశ్‌రెడ్డి మీడియాకు తెలిపారు. అయితే ఈ రెండు పార్టీలు తాజాగా ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. బిఆర్ఎస్ పార్టీకి రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు.శిరోమణి అకాలీదళ్ వంటి ఏకసభ్య పార్టీలు, స్వతంత్రులు ఎటు- మొగ్గుతారో చూడాల్సి ఉంది. రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగనున్నందున.. అధికార కూటమి నుంచి సుదర్శన్‌రెడ్డికి క్రాస్‌ఓటింగ్ జరుగుతుందని కాంగ్రెస్ ఆశాభావంతో ఉంది. అటు బీజేపీ కూడా.. తమిళనాడు ఎంపీల్లో కొందరు తమ రాష్ట్రానికే చెందిన రాధాకృష్ణన్ వైపు మొగ్గుచూపుతారని అంచనా వేస్తోంది. దళిత, ఆదివాసీ ఎంపీలందరూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికే మద్దతివ్వాలని తమిళనాడుకు చెందిన వీసీకే ఎంపీ తిరుమావళవన్ ఒక లేఖలో పిలుపిచ్చారు. ఆయన పార్టీకి లోక్‌సభలో ఇద్దరు సభ్యులున్నారు. 2002 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భైరాన్‌సింగ్ షెకావత్‌కు 454 ఓట్లు- రాగా.. ఆయనపై బరిలోకి దిగిన కాంగ్రెస్ సీనియర్ నేత సుశీల్‌కుమార్ షిండేకు 302 ఓట్లు- వచ్చాయి. వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనదు 516 ఓట్లు- సాధించగా.. ప్రత్యర్థి గోపాలకృష్ణ గాంధీకి కేవలం 244 ఓట్లు- వచ్చాయి. 2022 ఎన్నికల్లో జగదీప్ ధన్‌ఖడ్‌కు 520 ఓట్లు- వచ్చాయి. విపక్షాల ఐక్య అభ్యర్థి మార్గరెట్ ఆల్వా కేవలం 182 ఓట్లు- సాధించారు. ఈసారి ఎన్‌డీఏ అభ్యర్థికి 500 ఓట్లలోపే వచ్చే అవకాశాలున్నాయి. ప్రతిపక్షాలు తమకు ఉన్న మొత్తం 324 ఓట్లు- సాధించినప్పటికీ.. అన్ని ఎక్కువ ఓట్లు- పొంది ఓడిపోవడం ఇదే మొదటిసారి అవుతుంది. చెల్లని ఓట్లపై రెండు కూటముల్లో ఆందోళన నెలకొంది. 2022లో 15 మంది ఎంపీల ఓట్లు- చెల్లకపోవడమే దీనికి కారణం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంపీలకు కూడా ఓటు- వేయడం రాకపోతే ఎలాగని ఉభయ కూటముల నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఎంపీలు తమ ఓటింగ్ ప్రాధాన్యాలను అక్షరాల్లో కాకుండా అంకెల ద్వారా సూచించాలని.. కానీ కొందరు అది గ్రహించలేక పోతున్నారని వారు చెబుతున్నారు. అంతేగాక.. ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిర్దిష్ట పెన్నులతోనే వారు తమ ప్రాధాన్యాలను తెలుపవలసి ఉంటుంది. మరే ఇతర పెన్నులు వాడినా ఓటు చెల్లదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రతి 15 మంది పార్టీ ఎంపీలకు ఒక సమన్వయకర్తను నియమించింది. ప్రతిపక్ష సభ్యులను సమన్వయపరిచేందుకు ప్రత్యేక బృందాలను మోహరించింది.

## ఆత్మప్రబోధానుసారం ఓటేయండి

### ఎంపీలకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి వినతి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** ఆత్మప్రబోధానుసారం ఓటేయాలని ఇండియా కూటమి తరపున బరిలో నిలిచిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి.. పార్లమెంటు సభ్యులను కోరారు. దేశం పట్ల ప్రేమ ఉంటే తనను ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని, తాను వ్యక్తిగా మద్దతు కోరడం లేదని అన్నారు. కొన్ని దశాబ్దాల పాటు ప్రజాసేవలో అనుభవం ఉన్న తనకు ప్రజాస్వామ్య తీరుతెన్నులు తెలుసునని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. తనకు అవకాశమిస్తే పార్లమెంటరీ సంప్రదాయాలను నిష్పాక్షికంగా, హుందాగా పరిరక్షిస్తానని హామీ ఇచ్చారు. తాను మాజీ ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను అనుసరిస్తూ జాతీయ ప్రయోజనాలను కాపాడతానన్నారు. తక్షణ రాజకీయ ఒతిళ్లకు లోను కాకుండా.. సమాఖ్య స్ఫూర్తిని పరిరక్షిస్తానని, నిబంధనల్ని అమలు చేయడంతోనే సరిపెట్టుకోకుండా చర్చల పవిత్రతను కాపాడుతానని హామీ ఇచ్చారు.సర్వసత్తాక ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా భారతదేశ విలువలను గౌరవించేందుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీకీ విధేయంగా ఉండాల్సిన అవసరం లేదని, ఏ పార్టీ విప్ జారీ చేయదని తెలిపారు. రహస్య బ్యాలెట్ ప్రకారం ఓటింగ్ జరుగుతుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికీ తమ అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించాల్సిన నైతిక బాధ్యత ఉందన్నారు. ఈ మేరకు ఉభయ సభల ఎంపీలకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదివారం లేఖ రాశారు. తనను ఎన్నుకుంటే.. పార్లమెంట్ సంప్రదాయాన్ని కాపాడినట్లు, చర్చల హుందాతనాన్ని పునరుద్ధరించినట్లు అవుతుందన్నారు. తనకు ఓటు వేయడం భారతదేశ స్ఫూర్తికి ఓటు వేయడమేనని, భవిష్యత్తు తరాలు గర్వపడేలా మన రిపబ్లిక్‌ను కాపాడాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామిక విలువలు క్షీణిస్తున్నాయని, హక్కులు ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

## జస్టిస్ సుదర్శన్ రెడ్డికే ఓవైసీ మద్దతు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి, జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మజ్లిస్ తన మద్దతు ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డి మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీకి ఫోన్ చేసి జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరిన నేపథ్యంలో.. ఆ మేరకు పార్టీ నిర్ణయం తీసుకుందని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వడమే సమంజసమని భావిస్తున్నట్లు ఒవైసీ పేర్కొన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపినట్లు- 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఆయనకే తమ ఓటు అని ఓవైసీ ప్రకటించారు. మజ్లస్ పక్షాన పార్లమెంటులో ఓవైసీకి ఒక్కరికే ఓటుంది.




## తటస్థంగా బీఆర్ఎస్

### ఓటింగ్ దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు సమాచారం

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎవరికి ఓటేయాలో తేల్చుకోలేక పోయింది. దీంతో నేడు జరుగనున్న భారత ఉప రాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్టు- తెలుస్తోంది. ఎన్డీఏ, ఇండియా కూటమి.. రెండూ తెలంగాణకు ద్రోహం చేశాయంటోన్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో తటస్థ వైఖరి అవలంభించాలని చూస్తున్నట్టు సమాచారం. ఉప రాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్టు, ప్రస్తుతం దేశ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇదే సరైన నిర్ణయమని బీఆర్ఎస్ అధినేత భావిస్తున్నట్టుగా ఆ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. దీనికి సంబంధించి నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉంది. బీఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ తాజా నిర్ణయంతో తెలంగాణ కాంగ్రెస్ అగ్గి మీద గుగ్గిలమవుతోంది. బీఆర్ఎస్ బీజేపీ చీకటి ఒప్పందం బట్టబయలు అయిందని ఆ పార్టీ విమర్శిస్తోంది. ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరం ఉండడం పరోక్షంగా బీజేపీకి మేలు చేయడం మాత్రమే అని చెడ్డీలు వేసుకొని రాజకీయాలను టీ-వీలో చూసే పిల్లవాడికి కూడా తెలుసు అంటూ ఆ పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు. ఇదే బీఆర్ఎస్- బీజేపీ అసలు స్వరూపమని కూడా సామా విమర్శించారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలో తొలి ఓటు వేయనున్న మోడీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 8 :** ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం నాడు జరగనుంది. ఈ ఎన్నికలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలి ఓటు వేయనున్నారు. పంజాబ్, హర్యానా ఎంపీలతో కలిసి ప్రధాని తన ఓటు- హక్కును వినియోగించుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండేలను ఉప రాష్ట్రపతి ఎన్నికలకు ఎలక్షన్ ఏజెంట్లుగా నియమించారు. మంగళవారం ఉదయం ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్డీయే ఎంపీలకు సోమవారం రాత్రి డిన్నర్ ఇచ్చారు. ఓటింగ్ సందర్భంగా ఎంపీల మధ్య పూర్తి సమన్వయం, ఐక్యతకు ఈ తరహా విందు సమావేశాలు ఎంతో ఉపకరిస్తుంటాయని ఎన్డీయే సీనియర్ నేత ఒకరు తెలిపారు. తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ఎన్డీయే భాగస్వాముల నుంచి పూర్తి మద్దతు ఉందని చెప్పారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు బిజూ జనతాదళ్ దూరం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనున్న నేపథ్యంలో పలు రాజకీయ పార్టీలు తమ నిర్ణయాలను ప్రకటిస్తున్నాయి. ఈ ఎన్నికలకు దూరంగా ఉండనున్నట్లు- ఇప్పటికే భారత రాష్ట్ర సమితి ప్రకటించగా.. తాజాగా ఒడిశాలోని ప్రధాన ప్రతిపక్షపార్టీ బిజూ జనతాదళ్ సైతం అదే వైఖరిని అవలంబిస్తూ నిర్ణయం తీసుకుంది. మంగళవారం జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్‌లో తమ పార్టీ ఎంపీలు దూరంగా ఉంటారని బీజేడీ రాజ్యసభ ఎంపీ సస్మిత్ పాత్రా దిల్లీలో వెల్లడించారు. పార్టీ ఎంపీలు, రాజకీయ వ్యవహారాల కమిటీ-(పీఏసీ)తో సంప్రదింపుల అనంతరం బీజేడీ అధినేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు- దిల్లీలో ప్రకటించారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమిలకు తమ పార్టీ సమాన దూరం కొనసాగించాలనే విధానంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. తమ దృష్టి అంతా రాష్ట్రాభివృద్ధి, 4.5 కోట్ల మంది ప్రజల అభ్యున్నతిపైనేనని పాత్రా స్పష్టం చేశారు. బిజూ జనతాదళ్‌కు రాజ్యసభలో ఏడుగురు ఎంపీలున్నారు. ఉపరాష్ట్రపతి పోలింగ్ మంగళవారం జరగనుంది. ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పోటీ-పడుతుండగా.. విపక్ష కూటమి తరపున తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి బరిలో ఉన్న విషయం తెలిసిందే.

# స్మార్ట్ వైజాగ్‌కు మరో ముందడుగు

మొదటి పేజీ తరువాయి

విశాఖలోని మధురవాడ జోన్-2లో అత్యాధునిక మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఈ రుణం ఉపయోగించనున్నారు. మొత్తం రూ.553 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఐఎఫ్‌సీ రూ.498 కోట్లను రుణంగా అందిస్తోంది. మిగిలిన మొత్తంలో రూ.45.64 కోట్లను అమృత్ 2.0 పథకం కింద, మరో రూ.9.36 కోట్లను జీవీఎంసీ తన సొంత నిధుల నుంచి భరించనుంది. విశేషమేమిటంటే, ఈ రుణాన్ని జీవీఎంసీ తన సొంత ఆదాయ వనరుల నుంచే 15 ఏళ్లలో తిరిగి చెల్లించనుంది. దీనికి 8.15 శాతం ఫ్లోటింగ్ వడ్డీ రేటు వర్తిస్తుంది. రాబోయే 30 ఏళ్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా 100 శాతం భూగర్భ డ్రైనేజీ నెట్‌వర్క్, ఆధునిక పంపింగ్, లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగం, రీసైక్లింగ్ చేస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆ ప్రాంతంలో అంటువ్యాధులు తగ్గడంతో పాటు, భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయి. పర్యావరణ పరిరక్షణకు, వరద నీటి నిర్వహణకు ఇది ఎంతగానో దోహదపడుతుంది.



### రైతుల సమస్యలపై సీఎం దృష్టి

ఈ కీలక ఒప్పందం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రంలోని రైతాంగ సమస్యలు, ఇతర పాలనాపరమైన అంశాలపై ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులను కఠినంగా ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80,503 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ ఉందని, మరో 10 రోజుల్లో అదనంగా 23,592 మెట్రిక్ టన్నులు రానుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా, ఉల్లి రైతులు నష్టపోకుండా క్వింటాలుకు కనీస ధర రూ.1200 తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తురకపాలెం గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగుమందు డబ్బాతో ఆత్మహత్య నాటకమాడిన వారిపై విచారణ జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో యూరియా సమస్యకు చెక్

**అమరావతి :** రాష్ట్రంలో యూరియా సమస్య లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మొత్తం 80,503 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు- అధికారులు ఆయనకు వివరించారు. యూరియా సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, ఆర్టీజీఎస్, తురకపాలెంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పది రోజుల్లో 23,592 మెట్రిక్ టన్నుల యూరియా రాబోతున్నట్లు- అధికారులు సీఎంకు తెలిపారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ఎరువుల కేటాయింపుపై కేంద్రమంత్రి నడ్డాతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. కాకినాడకు వచ్చే నౌకలో 7 రేక్‌ల యూరియా ఏపీకి ఇవ్వాలని సీఎం కోరారు. అందుకు నడ్డా సానుకూలంగా స్పందించారు. కేంద్రమంత్రి జేపీ నడ్డాకు చంద్రబాబు నాయుడు ఫోన్ చేశారు.. రాష్ట్రంలో యూరియా సరఫరాపై సమీక్ష నిర్వహించిన సీఎం.. సమావేశం మధ్యలోనే జేపీ నడ్డాకు ఫోన చేశారు.. కాకినాడ తీరానికి వచ్చే నౌకలో 7 వేగన్లు.. ఏపీకి కేటాయించాలని కోరారు.. దీనిపై సానుకూలంగా స్పందించారట నడ్డా.. ఇక, దీంతో, రాష్ట్రానికి 17,293 మెట్రిక్ టన్నుల యూరియాను కాకినాడ పోర్టులో దిగుమతికి జీవో జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రంలో అత్యవసరంగా యూరియా కోసం ఎదురు చూస్తున్న జిల్లాలకు యుద్ధప్రాతిపదికన యూరి యాను పంపాలని అధికారులను ఆదేశించారు మంత్రి అచ్చెన్నాయుడు.. రైతులకు ఎక్కడా యూరియా సమస్య లేకుండా చూడాలని స్పష్టం చేశారు.. ఇక, రాష్ట్రంలో ప్రస్తుతం 80,503 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ ఉందని మంత్రి అచ్చెన్నాయుడికి తెలిపారు అధికారులు.. యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు అచ్చెన్నాయుడు.. ఎరువుల కేటాయింపు అంశంపై కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో ఫోన్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడటం వలనే రాష్ట్రానికి యూరియా కేటాయింపు జరిగిందన్నారు.. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి రైతులకు ఎరువులపై భరోసా ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.. మరోవైపు, రబీ సీజన్ కు కేంద్రం 9.3 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రాష్ట్రానికి కేటాయించిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు మంత్రి అచ్చెన్నాయుడు. రబీ సీజన్‌లో యూరియా పంపిణీకి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని సీఎం అన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి ఎరువులపై రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. కర్నూలు మార్కెట్‌లో ఉల్లి కొనుగోళ్లు, మద్దతు ధరపై సమీక్ష నిర్వహించిన చంద్రబాబు.. క్వింటా ఉల్లి ధర రూ.1,200కు తగ్గకుండా చూడాలని స్పష్టం చేశారు. ఒకవేళ తగ్గితే.. మిగిలిన డబ్బును ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. అరకు కాఫీకి సోకిన కాయ తొలుచు తెగులుపై చంద్రబాబు ఆరా తీశారు. ఇతర ప్రాంతాలకు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తురకపాలెం గ్రామ ఆరోగ్య పరిస్థితిపై నిత్యం సమీక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# ఏపీలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక కార్యదర్శిగా అనంత్‌రామ్‌ను బదిలీ చేశారు. రెవెన్యూశాఖ (ఎండోమెంట్) కార్యదర్శిగా ఎం.హరిజవహర్‌లాల్‌ను నియమించారు. ఆ స్థానంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వాడ్రేవు వినయ్ చంద్‌ను రిలీవ్ చేసింది.అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండేను నియమించింది. మైనార్టీ, సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్‌ను బదిలీ చేసింది. ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అండ్ ఇన్సురెన్స్, మెడికల్ సర్వీసెస్ కార్యదర్శిగా ఎం.వి.శేషగిరి బాబు బదిలీ చేసింది. ఆయనకు లేబర్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.ఇక వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఎంటీ-. కృష్ణబాబును.. రోడ్లు, భవనాలు శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. అలాగే పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు శాఖకు స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆరోగ్య శాఖ కార్యదర్శిగా సౌరవ్ గౌర్‌ను బదిలీ చేశారు. ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ముఖేష్ కుమార్ మీనాను నియమించారు. ఆయనకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే ఢిల్లీలోని ఏపీ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్‌ను బదిలీ చేశారు. ఐఏఎస్‌ల బదిలీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు గత కొన్ని రోజులుగా తీవ్ర కసరత్తు చేశారు. బాగా పని చేసిన వారిని ప్రోత్సహించేలా నిర్ణయం తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఈ మేరకు తితిదే ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# తెరుచుకున్న శ్రీవారి ఆలయం

## గ్రహణంతో శుద్ధి కార్యక్రమాల అనంతరం దర్శనం

**తిరుమల :** చంద్రగ్రహణం ముగియగానే తిరుమలలో ఆలయ ద్వారాలు మళ్లీ భక్తుల కోసం తెరుచుకున్నాయి. గ్రహణం కారణంగా మూసివేసిన ఆలయాన్ని శుద్ధి కార్యక్రమాల అనంతరం తిరిగి ప్రారంభించారు. గ్రహణం వీడిన వెంటనే ఆలయంలో సంప్రోక్షణ, పవిత్ర కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం కలియుగ దైవం శ్రీనివాసుడికి ఏకాంతంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ పూజల తర్వాత భక్తులకు స్వామివారి దర్శనానికి అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలను నిలిపివేయడం జరిగిందని టీటీడీ అధికారులు చెప్పారు. అలాగే, శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులకు జారీ చేసే టోకెన్లు కూడా రద్దు చేస్తున్నట్లు- తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు అధికారులు తెలియజేశారు. సాధారణంగా తెల్లవారుజామునే శుద్ధి కార్యక్రమాలు పూర్తిచేసి ఆలయ ద్వారాలను తెరిచారు. గ్రహణం కారణంగా ఏర్పడిన ఈ ప్రత్యేక పరిస్థితుల మధ్య, తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు.

# జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదు

## నిల్వ చేసుకోవాలన్న ఆలోచన వద్దు

## రైతులకు మంత్రి అచ్చన్నాయుడు సూచన

**శ్రీకాకుళం :** ఏడాది అంతటికి ఒకేసారి యూరియా నిల్వ చేసుకోవాలనే రైతులు ఆలోచనతోనే యూరియా సమస్య తలెత్తిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పుకొచ్చారు. ఎకరాకు 25 కేజీల యూరియా వాడాలని సూచించారు. ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని 25 కేజీల చొప్పున మూడు విడుతలుగా రైతులకు అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కొరతపై అన్నదాతలు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఉద్ఘాటించారు. సోమవారం శ్రీకాకుళం రూరల్ మండలం తండెంవలస గ్రామంలో ఎరువులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే, యూరియా



పంపిణీ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ఇది వ్యవసాయ శాస్త్రజ్ఞుల సూచనలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయని తెలిపారు. దేశంలో దీనికి సంబంధించిన సర్వేలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి ఆలోచనలు చేశాయని వివరించారు మంత్రి అచ్చెన్నాయుడు. ఈ సంవత్సరం 70శాతం మార్క్‌ఫెడ్‌కు, 30 శాతం ప్రైవేట్ షాపులకు కేటాయించారని గుర్తుచేశారు. యూరియా రాదేమోనని మూడు విడతల్లో వేయాల్సిన దానిని ఒకేసారి అన్నదాతలు తీసుకుని నిల్వ చేయడంతోనే యూరియా సమస్య వచ్చిందని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. అవసరమైతే ఇంటింటికీ యూరియా ఇస్తామని వెల్లడించారు. రూ.300 కంటే ఎక్కువకు యూరియా అమ్మితే చట్టపరమైన చర్యలు ఉంటాయని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

### యూరియా కోసం రైతుల పాట్లు

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కోసం క్యూలో పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం తీరును తీవ్రంగా నిరసించారు. ప్రభుత్వం యూరియా కొరత లేదని చెబుతున్నారు గాని యూరియా కొరతతో మొక్కజొన్న, వరి నాటిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు- రైతుల తెలిపారు. చాలీచాలని యూరియా వస్తుండడంతో కనీసం రైతులకు తెలిసే లోపల అయిపోవడం ఎటువంటి సమాచారం కానీ మండల ఏవో తెలపకపోవడంతో రైతులకు కందులు వచ్చిన విషయం కూడా తెలియదని పలువురు రైతులు తెలిపారు. యూరియా విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఉన్నతాధికారుల సైతం కొరత లేదని తెలపడం ఆశపరంగా ఉందని పలువు రైతులు తెలిపారు.

# భారత్ ఫస్ట్ మా నినాదం

## ఎన్డీఏ కూటమి అభ్యర్థికే మా ఓటు

### కూటమిలో ఉంటూ ఇతరకు ఓటెలా వేస్తాం

### ఉపరాష్ట్రపతి అయినా..మరే ఎన్నికైనా ఒకే నిర్ణయం

### హిందీ నేర్చుకోవడంలో తప్పలేదు...

### విద్యార్థులు ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు

### ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్‌లో మంత్రి లోకేశ్

**అమరావతి:** తమ పార్టీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి ఎల్లప్పుడూ మద్దతు చేస్తుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కి తమ మద్దతు ఉంటుందన్నారు. టీడీపీ ఎన్డీఏలో చేరిందని, మేము ఈ కూటమికి నిబద్ధతతో మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2025కు ఆంధ్రప్రదేశ్ మంత్రి, యువ నేత నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిగిన కీలక ప్రశ్నలకు లోకేష్ స్పష్టమైన సమాధానం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై మాకు పూర్తి నమ్మకం ఉందని,



ఎన్డీఏ అభ్యర్థిని మేము సపోర్ట్ చేస్తామని అన్నారు. సరైన సమయం, సరైన స్థలం, సరైన నాయకత్వం అన్నీ కలిస్తేనే గొప్ప మార్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అది ఉపరాష్ట్రపతి ఎన్నికలైనా, ఇతర ఎన్నికలైనా మా స్టాండ్ క్లియర్‌గా ఎన్డీఏ అభ్యర్థికే ఉన్నట్లు- తెలిపారు. ఎన్డీఏ మొదట తమ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత, తన ఎంపీలతో కలిసి ఢిల్లీలో సీపీ రాధాకృష్ణన్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు- లోకేష్ గుర్తు చేశారు. కానీ ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరుని తర్వాత ప్రకటించిందని అన్నారు. అప్పటికే టీడీపీ మద్దతు సీపీఆర్‌కు ప్రకటించినట్లు- చెప్పారు. మేము సీపీఆర్‌కి సపోర్ట్ చేస్తున్నామని వాళ్లకు తెలుసు. అయినా, వాళ్లు కావాలనే పొలిటికల్ గేమ్ ఆడుతున్నారని, అలాంటి రాజకీయాలకు మేము లొంగమని లోకేష్ స్పష్టం చేశారు. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వ్యక్తి. తెలుగు వ్యక్తికి మీరు ప్రాధాన్యత ఇస్తారా లేదా జాతీయ రాజకీయాలా అని అడిగినప్పుడు, లోకేష్ టీడీపీ స్లోగన్.. భారత్ ఫస్ట్ అని పేర్కొన్నారు. మా ఎజెండా భారత్ ఫస్ట్. ఇది చాలా క్లియర్. దేశాన్ని ముందుండి నడిపించే నాయకత్వానికి మేము సపోర్ట్ చేస్తామన్నారు. మోదీ నాయకత్వానికి 100 శాతం మద్దతు ఇస్తామని, ఉపరాష్ట్రపతి ఎన్నికల వల్ల మా ఫోకస్ మారదని లోకేష్ స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు దేశ రాజకీయాల్లోకి వస్తారా అని ప్రశ్నించినప్పుడు..లోకేష్ చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని వివరించారు. చంద్రబాబు రెండు కళ్లూ ఆంధ్రప్రదేశ్‌పైనే ఉన్నాయని, ఆయన లక్ష్యం ఒకటే. ఆంధ్రప్రదేశ్‌ని నంబర్ వన్ రాష్ట్రంగా మార్చడం. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. మేము గల్లీ లీడర్స్, ఢిల్లీ లీడర్స్ కాదన్నారు. మాకు గల్లీ పొలిటిక్స్ ఇష్టం. మా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే మా గోల్ అని రూమర్స్‌కి ఫుల్‌స్టాప్ పెట్టారు. 2029 ఎన్నికల వరకు మేము ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని నారా లోకేశ్ సమర్థించారు. నూతన జాతీయ విద్యావిధానంలో మూడు భాషలు నేర్చుకోవాలని చెబుతున్నప్పటికీ ఎక్కడా హిందీ తప్పనిసరి అని చెప్పలేదని అన్నారు. 'నేను దిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిశాను. మాతృభాషలో బోధనపై దృష్టిపెట్టాలని ఆయన స్పష్టంగా చెప్పారు. ఒక భారతీయుడిగా మాతృభాష ప్రాధాన్యం నాకు తెలుసు. అలాగే హిందీ నేర్చుకోవడం ఎంత ముఖ్యమో తెలుసు' అని వ్యాఖ్యానించారు. తన సొంత అనుభవాన్ని లోకేశ్ వివరిస్తూ తాను కూడా మూడు భాషలు నేర్చుకున్నానని వెల్లడించారు. 'నేను మూడు భాషలు నేర్చుకున్న విద్యార్థిని. నా కుమారుడు కూడా అదే పని చేస్తున్నారు. ఇవాళ పిల్లలు ఐదు భాషలు నేర్చుకుంటున్నారు. జర్మన్, జపనీస్ ఇలా ఎన్నో భాషలు ఉన్నాయి. అవి నేర్చుకుంటే ఆ దేశాల్లో పని చేయడానికి వీలవుతుందని వివరించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా దక్షిణాది భాషలు నేర్చుకోవాలా? అని ప్రశ్నించగా 'ఎందుకు నేర్చుకోకూడదు? ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో ఒడియా, తమిళ్, కన్నడ మాధ్యమాల్లో బోధించమని ఆదేశాలు జారీ చేస్తున్నాం. పిల్లలు తాము కోరుకునే భాష నేర్చుకోవాలి. రాజకీయ నిర్ణయాల ఆధారంగా అది జరగకూడదు' అని పేర్కొన్నారు.

# ప్రజా తీర్పును గౌరవించాలి

మొదటి పేజీ తరువాయి

వర్షాకాల సమావేశాలు ఈ నెల 18 నుంచి ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఈ సమావేశాలకు వైకాపా ఎమ్మెల్యేలు హాజరుకావాలని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కోరారు. సోమవారం అనకాపల్లిలో పర్యటించిన ఆయన.. మీడియాతో మాట్లాడా రు. యూరియాపై వైకాపా నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని సమస్యలపై చర్చించేందుకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలన్నారు. అందరు ఎమ్మెల్యేలలాగే వైకాపా ఎమ్మెల్యేలకు కూడా సమయం ఇస్తామని స్పీకర్ అయ్యన్న పాత్రుడు స్పష్టం చేశారు. సమస్యలపై చర్చించడానికి విపక్ష పాత్రఅసవరం లేదన్నారు. అది ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రకారం వస్తుందే తప్ప డిమాండ్ చేస్తే రాదన్నారు.



# సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు

**అమరావతి :** సీపీఎస్ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. మొదటి విడుత డీఏ బకాయిలను విడుదల చేసింది ఏపీ ప్రభుత్వం. త్వరలోనే మిగిలిన సీపీఎస్ ఉద్యోగులు అందరికీ 90శాతం బకాయిలు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసింది. సుమారు ఆరు విడుతలుగా ఈ మొత్తం చెల్లింపునకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఒక్కో ఉద్యోగికి రూ. 40వేల నుంచి రూ.70వేల వరకు సోమవారం వారి అకౌంట్లకు జమచేసింది ప్రభుత్వం. మిగిలిన వారికి ఆరు విడతల్లో అంటే ఒక్కో ఉద్యోగికి రూ. 2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డీఏ బకాయిల విడుదల పట్ల ఏపీ సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోట్ల రాజేష్, నాపా ప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు.

# "లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కూలు బ్యాగులు నోట్ బుక్స్ పంపిణీ




**సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్..:** ""ఈరోజు లయన్స్ క్లబ్ హనుమకొండ కాకతీయ వారి ఆధ్వర్యంలో ఏనుగల్ గ్రామ zpss స్కూల్ విద్యార్థులకు ఉచిత స్కూలు బ్యాగు లు నోట్ పుస్తకాలు ఇవ్వడం జరిగింది... ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు నరసింహా రావు సార్ గారు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ నాగెల్లి సంతోష్ బి నాగెల్లి కావ్య దంపతులు విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు మరియు గూడ నరేందర్ వర్మ గారు పాల్గొనడం జరిగింది

# ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లాఅదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు.



**వికారాబాద్,సెప్టెంబర్,(సమయం న్యూస్) :** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 83 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, డి ఆర్ ఓ మంగి లాల్, ఆర్ డి ఓ వాసుచంద్ర, లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. పెన్షన్, వ్యవసాయం, గృహనిర్మాణ శాఖ, భూ సమస్యలు వచ్చాయని, అట్టి ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచ కుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మండల స్పెషల్ అధికారులు గ్రామాలలో శానిటేషన్ పై దృష్టి సారించాలని, తప్పని సరిగా మండలాలో స్కూల్స్, రేసిడేన్సీయల్స్ లో విద్యార్థులకు పెట్టె మధ్యాహ్న బోజనాలను పరిశీలించాలని , డేంగ్యు ,మలేరియా జ్వరాలు రాకుండా చుసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు అందరు సమయ పాలన పాటించాలని , ప్రతి సోమవారము జరిగే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, అత్యవసర పనులపై వెళ్ళే అధికారులు ముందుగా పర్మిషన్ తీసుకోవాలని,అధికారి పర్మిషన్ తీసుకుంటే సెకండ్ లెవల్ అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రవక్త మొహమ్మద్ ( స ) జీవితం - సందేశం సభ పోస్టర్ల ఆవిష్కరణ



**ఖమ్మం, సెప్టెంబర్ 8 : ( సమయం న్యూస్ )**ఈ నెల 20 తేదీన ఖమ్మం నగరం లోని భక్త రామ దాసు కళాక్షేత్రం లో ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ఆధ్వర్యం లో నిర్వహించనున్న భారీ ధార్మిక బహిరంగ సభ పోస్టర్లను మధిర నియోజక వర్గ వ్యాప్తం గా ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మౌలానా షేక్. ముజాహిద్ ఇషాతి, సంఘం తెలంగాణ జనరల్ సెక్రటరి షేక్. మొహమ్మద్ గౌసోదీన్, ఉపాధ్యక్షులు షేక్.హుసేన్ లు మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథులుగా ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్ర రాంపూర్ ఎంపీ మౌలానా ముహిబుల్లా నద్వి , పంజాబ్ షాహి ఇమామ్మౌలానా మొహమ్మద్ ఉస్మాన్ ,జె ఎన్హెటీ యూ ప్రొఫెసర్, సూఫీ శాంతి సంఘంవ్యవస్థకులు డాక్టర్ హఫీజుర్ రెహమాన్హాజరు అవుతున్నారని తెలిపారు. వీరితో పాటు తెలుగు ప్రసంగికులు మౌలానా అబ్దులు వస్తా ఆన్ ,మదర్సా దారుల్ ఉలుమ్ కరస్పాండెంట్ మౌలానా మహమ్మద్ సయీద్ అహ్మద్ ఖా స్మి , ముఫ్తీ అత్ హర్ ఖా స్మి( కోదాడ ) లు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ హాజరై ధార్మిక బహిరంగ సభ ను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆవిష్కరణ కార్యక్రమంలో మధిర మండల అధ్యక్షులు షేక్. గాలిబ్ నాయకులు బాసిత్ అలీ, మహబూబ్ పాషా, అబ్దుల్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన పర్వతగిరి గ్రామ మాజీ సర్పంచ్ చింతపట్ల మాలతి - సోమేశ్వరరావు



**సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్..** పర్వతగిరి మండలానికి చెందిన "దుండి సారంగపాణి" గారు మరియు "పసుల హరీకుమార్" గారు మృతిచెందగా ఇరువురి పార్థవదేహాల్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి వ్యక్తం చేసి నివాళులర్పించారు...వీరితో మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు , మండల నాయకులు రంగు కుమార్ గౌడ్ (ఫర్టిలైజర్ ) నూనె ఏకాంతం, చిన్నపెల్లి వెంకన్న,కొండ వెంకటేశ్వర్లు, చీదురు తిరుపతి,నీరిటి వెంకన్న, అంబటి కుమార్, కొప్పు రాజు,నీరిటి పాపయ్య, నీరిటి ప్రశాంత్,గ్రామ ప్రధాన కార్యదర్శి బోట్ల శ్రీకాంత్, ST మండల నాయకులు ఇస్లావత్ హరీష్, సోషల్ మీడియా చిన్నపెల్లి అజయ్ తదితరులు ఉన్నారు.ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రతినిధి బృందం ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి ఆధ్వర్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలవడం జరిగింది. ఆర్టీసీలో ఆపరిష్కృత కార్మిక సమస్యల మీద ముఖ్యంగా కార్మికులను అత్యంత ఆందోళనకు గురి చేస్తున్న వర్క్ షాప్ ల ఎత్తివేతకు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని విరమింపజేయ్యాలని, తక్షణం అట్టి వర్క్ షాపుల తరలింపును ఆపివేయాలని తద్వారా సంస్థకి కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా ఆర్టీసీలో జరుగుతున్న పరిణామాలు, పని ఒత్తిడి మరియు పెండింగ్ లో ఉన్న విలీన ప్రక్రియ ఇంకా యూనియన్ల పునరుద్ధరణ మీద చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేసారు. నాయకుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి వర్క్ షాపుల తరలింపు తన దృష్టికి రాలేదని, ముఖ్యమంత్రి తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ముఖ్యసలహాదారు బొయపల్లి యద్దయ్య,జి హెచ్ జోనల్ కార్యదర్శి R.N.రెడ్డి, హైదరాబాద్ రీజియన్ ప్రెసిడెంట్ V.శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, సికింద్రాబాద్ రీజియన్ కార్యదర్శి గోపు శ్రీనివాస్, అక్తర్ పాషా మొదలగు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రతినిధి బృందం ప్రధాన కార్యదర్శి

# థామస్ రెడ్డి ఆధ్వర్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలవడం జరిగింది.

ఆర్టీసీలో ఆపరిష్కృత కార్మిక సమస్యల మీద ముఖ్యంగా కార్మికులను అత్యంత ఆందోళనకు గురి చేస్తున్న వర్క్ షాప్ ల ఎత్తివేతకు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని విరమింపజేయ్యాలని, తక్షణం అట్టి వర్క్ షాపుల తరలింపును ఆపివేయాలని తద్వారా సంస్థకి కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా ఆర్టీసీలో జరుగుతున్న పరిణామాలు, పని ఒత్తిడి మరియు పెండింగ్ లో ఉన్న విలీన ప్రక్రియ ఇంకా యూనియన్ల పునరుద్ధరణ మీద చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేసారు. నాయకుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి వర్క్ షాపుల తరలింపు తన దృష్టికి రాలేదని, ముఖ్యమంత్రి తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ముఖ్యసలహాదారు బొయపల్లి యద్దయ్య,జి హెచ్ జోనల్ కార్యదర్శి %=.చీ%.రెడ్డి, హైదరాబాద్ రీజియన్ ప్రెసిడెంట్ %ఎ%.శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, సికింద్రాబాద్ రీజియన్ కార్యదర్శి గోపు



శ్రీనివాస్, అక్తర్ పాషా మొదలగు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధికి శాస్త్రవేత్తలు అవసరం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం , సెప్టెంబర్ 8 : ( సమయం న్యూస్ ) :** దేశ అభివృద్ధి కి, ప్రజల భవిష్యత్ పురోగతికి శాస్త్రవేత్తలు అవసరం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కరకగూడెం జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల సమగ్ర పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్ ,మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలిస్తూ సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. తరగతి గదిలో విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి జీవిత లక్ష్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అవ్వాలని తమ అభిలాషను తెలియజేయగా, కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత లక్ష్యసాధనతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే దిశగా చదువుకోవడం, పరిశోధనలు చేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు, పరిశోధనలు చేయగలిగే శాస్త్రవేత్తలు దేశానికి ఎంతో అవసరమని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.డైనింగ్ హాల్ పరిశీలించి అక్కడ దోమలు, ఈగలు లోపలికి ప్రవేశించకుండా మెష్ ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.కూరగాయలు, పెరుగు తదితర పదార్థాలు నిల్వ చేసుకోవడానికి ఫ్రిజ్ ఏర్పాటు చేయాలన్న సిబ్బంది అభ్యర్థనపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన, పౌష్టికాహారం తీసుకుంటూ చదువు కొనసాగించేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. నవోదయ విద్యాలయాలు దేశవ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన బ్రాండ్గా గుర్తింపు పొందాయని, ఆ ప్రతిష్టను నిలబెట్టే విధంగా అధికారులు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించాల్సిందిగా ఆయన సూచించారు. అదేవిధంగా విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధికి అవసరమైన క్రీడా సామాగ్రి, లైబ్రరీ పుస్తకాలు త్వరలోనే ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.కలెక్టర్ పాఠశాల సిబ్బందితో సమావేశమై విద్యార్థులకు అందజేస్తున్న సదుపాయాలు, ఉన్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టవలసిన పనులను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపల్ భాస్కరాచారి, ఉపాధ్యాయులు నయనాదేవి, చంచల్, అనిత, స్టాఫ్ నర్స్ రాధిక మరియు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

- తాడే బోయిన రామస్వామి



**శేరిలింగంపల్లి సెప్టెంబర్ 8 సమయం న్యూస్. :** చందానగర్ పరిధిలో గల న్యూ గుడ్ షెప్పర్డ్ చెవిట, మూగ హైస్కూల్ నందు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ విద్యార్థిని, విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు, షార్ప్ నర్లు, ఎరేజర్లు మొదలగునవి.పండ్లు, బిస్కెట్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ మానవుని సర్వతోముఖాభివృద్ధి కేవలం విద్య తోటే సాధ్యమన్నారు.ప్రపంచంలో చాలా దేశాల వెనుకబాటు తనానికి కారణం నిరక్షరాస్యత అని భావించి యూనిస్కో వారు తేదీ: 08 వ తేదిన 1967 నుండి అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రపంచమంతటా ఒక ప్రత్యేకమైన నినాదంతో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరపు నినాద%శీ% డిజిటల్ యుగంలో అక్షరాస్యతను ప్రోత్సహించడం దీని యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్య ప్రాథమిక హక్కుగా, వ్యక్తిగత, సామాజిక అభివృద్ధిలో కీలక భాగమే అని తెలియజేయడమని అన్నారు. అక్షరాస్యత అనగా చదవడం, వ్రాయడం, అర్థం చేసుకోవడం లాంటివి. ఈ కార్యక్రమం వ్యక్తిగత సాధికారత మరియు సామాజిక పురోగతికి మూల స్తంభం. ఇటీవలి కాలంలో సమాజంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. విద్య, ఉపాధి అభివృద్ధి అవకాశాలకు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది ఇంకా దూరంగానే ఉన్నారు. భారతదేశంలో మిజోరాం, త్రిపుర, లక్షద్వీప్, కేరళ మొదలైన రాష్ట్రాలు అక్షరాస్యతలో ముందంజలో ఉన్నాయి. బీహార్, అరుణాచల ప్రదేశ్, రాజస్తాన్ అట్టడుగున ఉన్నాయి. ప్రపంచంలోని దేశాలలో అండోరా దేశం 100% అక్షరాస్యతతో ఉంది. భారతదేశంలో అక్షరాస్యత నిష్పత్తి 80.9% ఉండగా అందులో పురుషులు 87.2%, మహిళలు 74.6% ఉన్నారు. ప్రపంచ జనాభాలో 86% మంది అక్షరాస్యులుగా ఉన్నారు. చదువుకు వయసుతో నిమిత్తము లేదు. భారతదేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి ప్రభుత్వంతో పాటు పౌర సమాజం కూడా కృషి చేయాలి. అప్పుడే భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సి, అధ్యాపకులు శోభ, అంజలి మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

# లాభసాటి పంటల సాగుతో అధిక ఆదాయం సంపాదించాలి

● మంత్రి తుమ్మల



**ఖమ్మం, సెప్టెంబర్ 8 :( సమయం న్యూస్ ) :** లాభసాటి పంటలు సాగు చేస్తూ రైతులు అధిక ఆదాయం సంపాదించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం ఖమ్మం నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి శంకుస్థాపన చేశారు. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామంలో 3 కోట్ల రూపాయల తో చేపట్టిన వెనకబడిన తరగతుల బాలుర వసతి గృహ నిర్మాణ పనులకు, 30 లక్షలతో నిర్మించనున్న పశు వైద్యశాల భవనం, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు, ఖమ్మం నగర పాలక సంస్థ 9వ డివిజన్ పరిధిలో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి నిధులు 66 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. వి. వెంకటాయ-పాలెం పిఏసీఎస్ వద్ద ఏర్పాటుచేసిన సిఎస్ సి కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ నీటిపారుదల శాఖతో రివ్యూ నిర్వహించి నష్టపోయిన గ్రామ ప్రజలకు ఇంటి స్థలాల పంపిణీకి అవకాశం పరిశీలించాలని అన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో ఖమ్మం లో పదిహేను ఎత్తిపోతల పథకాలు చేపట్టామని అన్నారు .రైతులు వరి కాకుండా ఆయిల్ పామ్, వక్క, జాజి, జాజి పత్రి వంటి లాభదాయక పంటలు సాగు చేసి శాశ్వతంగా పేదరికం నుంచి బయటపడాలని మంత్రి సూచించారు. పిల్లలను బాగా చదివించాలని, విద్యతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద ఉన్న ప్రాంతాలు ఆరుతడి పంటలు వేసుకోవాలని అధిక ఆదాయం సంపాదించాలని అన్నారు. ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులు శాశ్వతంగా నిలిచిపోయేలా పూర్తి చేయాలని, ఎక్కడా నాణ్యత లోపం రావడానికి వీలు లేదని అన్నారు. 3 కోట్ల నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ కార్పొరేట్ సంస్థలకు ధీటుగా వసతి గృహాన్ని నిర్మించి పిల్లలకు అందుబా టులోకి తీసుకొని రావాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న ఇబ్బందులు సానుకూల దృక్పథంతో పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా విద్యా సంస్థలు ఉన్న జిల్లాలో మన ఖమ్మం 2వ స్థానంలో ఉందని అన్నారు. బీసీ హాస్టల్ నాణ్యతతో నిర్మాణం పూర్తి చేయాలని, ప్రాథమిక దశ నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకు నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 170 మంది విద్యార్థులు చదువుతున్నారని, రాబోయే విద్యా సంవత్సరంలో ఆ సంఖ్య 300కు చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డిఆర్డీవో సన్యాసయ్య, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా పశుసంవర్ధక అధికారి డా. పురందర్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, రఘునాథపాలెం ఎంపిడివో అశోక్ కుమార్, తహసీల్దార్ శ్వేత, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# సమగ్ర తుది ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

## హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి మరియు జీహెచ్ఎంసీ కమిషనర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 8, ,( సమయం న్యూస్):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా సమగ్రంగా సిద్ధం చేసేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు.

సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా సెప్టెంబర్ 2, 2025న ప్రచురించామనీ అన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం

మొత్తం 139 లొకేషన్ లు, 407 పోలింగ్ స్టేషన్లు ఉండగా 3 లక్షల 92 వేల 669 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.ఈ జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందజేసినట్లు, అలాగే తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్లలో కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్లను (BLAs) నియమించి, పారదర్శకంగా, ఖచ్చితంగా జాబితా సవరణలో భాగస్వాములు కావాలని పార్టీ ప్రతినిధులను కోరారు.

సెప్టెంబర్ 17 వరకు దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉందన్నారు.జూలై 1, 2025 నాటికి 18 ఏళ్లు పూర్తిచేసుకున్న అర్హులైన పౌరులు, సెప్టెంబర్ 17లోపు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలన్నారు.జాబితాలో ఏమైనా సవరణలు, మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే సెప్టెంబర్ 17లోపు సంబంధిత దరఖాస్తు ఫారాలు సమర్పించాలని చెప్పారు.

ఇప్పటి వరకు ఫారం-6, 6A, 7, 8 ద్వారా వచ్చిన 2,855 దరఖాస్తులు , అభ్యంతరాల్లో 8.62 శాతం దరఖాస్తులను పరిష్కరించామని, మిగతా దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కర్ణన్ తెలిపారు.

జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో

ప్రతి అర్హులైన ఓటరును జాబితాలో చేర్చేందుకు, తప్పులేని ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు రాజకీయ పార్టీల సహకారం అత్యంత అవసరమని అన్నారు.

తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 30, 2025న ప్రచురించబడుతుందని పేర్కొన్నారు.సమావేశానికి ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి విజయవన్ శి, అదనపు కమిషనర్ (ఎలక్షన్స్) మంగళతాయారు హాజరయ్యారు.రాజకీయ పార్టీల తరఫున నందేశ్ కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ), పి. వెంకటరమణ, పవన్ కుమార్ (భారతీయ జనతా పార్టీ), విజయ్ మల్లంగి (ఆమ్ ఆద్మీ పార్టీ), ఎం. శ్రీనివాసరావు (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా%-%మార్క్సిస్టు), రాజేష్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), వై. జయసింహ, కె. మాధవ్ (భారత్ రాష్ట్ర సమితి), కె. జోగేందర్ సింగ్, ప్రశాంత్ యాదవ్ (తెలుగుదేశం పార్టీ), సయ్యద్ ముస్తాక్ (ఎఐఎంఐఎం) తదితరులు హాజరయ్యారు.సమావేశానికి ముందుగా, హైదరాబాద్ జిల్లాలో జీఐఎస్ ఆధారిత నజరి నక్ష తయారీ కార్యాచరణ ప్రణాళికపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు.

# ప్రభుత్వ Sc Bc బాలికల వసతి గృహం,ఎస్టీ బాలల వసతి గృహం సందర్శించిన ట్రేని కలెక్టర్





**కొడంగల్, సెప్టెంబర్,08.09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ Sc Bc బాలికల వసతి గృహం మరియు ఎస్టీ బాలల వసతి గృహం సందర్శించారు.విద్యార్థినిలతో మాట్లాడుతూ భోజన వసతి మెను నోట్ పుస్తకాలు బెడ్ షీట్స్ యూనిఫాం మొదలైన ప్రభుత్వం అందించే వసతులను అడిగి తెలుసుకున్నాడు స్టోర్ రూమ్ కిచెన్ హాస్టల్ పరిసరాలు తిరిగి చూశారు ప్రధానంగా ఎస్సీ బాలికల మరి ఎస్టీ బాలుర వసతి గృహాలను దత్తత తీసుకొని కావలసిన సౌకర్యాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు.కలెక్టర్ వెంబడి Ascdo..వి పాండు HWO వరలక్ష్మి నిర్మల బాలరాజు ఉన్నారు

# శేరిలింగంపల్లి లో బిఆర్ఎస్ పార్టీకి లోకి కాంగ్రెస్ మరియు బీజేపీ నుండి భారీ చేరికలు.

**హైదరాబాద్ సెప్టెంబర్08( సమయం న్యూస్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోపినగర్ నుండి శ్రీ స్వామినాథ్ గారి మరియు సోమనాథ్ గారి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో ఈ రోజు భారీ సంఖ్యలో కాంగ్రెస్ మరియు బీజేపీ పార్టీల నుండి ప్రజలు భారీ ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ చారిత్రక సందర్భంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం యువ నాయకుడు శ్రీ మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ “కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని దిశాహీనంగా నడిపిస్తోంది. ప్రతి రంగంలో వైఫల్యమే వారి నియంత్రణలో ఉంది. బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల పాలనలో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించింది. ఇప్పుడు మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అవసరం అని ప్రజలు అర్థం చేసుకున్నారు” అని వివరించారు.

రవి యాదవ్ గారు చేరిన సభ్యులకు బిఆర్ఎస్ పార్టీ యొక్క విజయవంతమైన పాలన గురించి పుస్తకం అందచేసారు. ఈ పుస్తకంలో:

24/7 విద్యుత్ సరఫరా
కల్యాణ లక్ష్మి వంటి మహిళా సబలీకరణ పథకాలు
మహిళలకు 50% రిజర్వేషన్
దలిత బంధు వంటి పథకాలు
డబుల్ బెడరూమ్ ఇళ్లు
తెలంగాణకు భారతదేశంలో 1వ ర్యాంక్

కాంగ్రెస్ వైఫల్యాలు:

ఉద్యోగాలు ఇవ్వడంలో వైఫల్యం
వెల్ఫేర్ పథకాలు నిలిపివేత
ఋణ మాఫీ వాగ్దానం నెరవేర్పు లేదు
4000 నెలవారీ పింఛను 210 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా లేదు

చివరిగా రవి యాదవ్ గారు:

“మీరు ఇప్పుడు సరైన పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీ మాత్రమే తెలంగాణ ప్రజల హక్కులను కాపాడగలదు. కేసీఆర్, కేటీఆర్ గారి నేతృత్వంలో మనం మళ్లీ తెలంగాణను గొప్ప దశకు తీసుకెళ్లవచ్చు” అని ప్రేరణనిచ్చారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కె.ఎన్. రాములు, మల్లేష్ ముదిరాజ్, గడ్డం శ్రీనివాస్, స్వామినాథ్, గంగాధర్ గౌడ్, నవీన్ గౌడ్, సాయి నందన్ ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్, పవన్ ,వడ్డే శ్రీనివాస్, ప్రేమ్, శంకర్, మున్నా, సూర్య, అరుణ్, మంజుల, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 10న తుది ఓటరు జాబితా

కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 08( సమయం న్యూస్).** జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వంటేరు వజ్రమ్మ కుటుంబాన్ని పరామర్శించిన కామల్ల ఐలన్న





**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 8**

ఇటీవల ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి తల్లి ఒంటేరు వజ్రమ్మ మృతిచెందగా సోమవారం ఆ కుటుంబాన్ని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం అధ్యక్షులు కామల్ల ఐలన్న పరామర్శించారు. మృతికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నర్ర బిక్షపతి జిల్లా అధ్యక్షులు, తోట లక్ష్మణ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అంకిరెడ్డిపల్లి నరసింహులు జిల్లా కోశాధికారి, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సూర వెంకటయ్య, కుకునూరి నారాయణ జిల్లా కార్యవర్గ సభ్యులు, జూపల్లి మధు దౌలాపూర్ అధ్యక్షులు, కనకయ్య, బాలరాజ్, శ్రీనివాస్, ప్రభాకర్, గణేష్, లాలయ్య, నర్సింలు, యాదగిరి, కనకయ్య, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగులకు క్రీడా పోటీలు



**నిర్మల్ సెప్టెంబర్08( సమయం న్యూస్). :** తెలంగాణ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని యన్‌టిఆర్ మినీ స్టేడియంలో జిల్లా ఉద్యోగుల కోసం వివిధ క్రీడా పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చెస్, క్యారమ్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్‌తో పాటు మరికొన్ని ఆటలు ఉత్సాహంగా సాగాయి. ప్రతి విభాగంలో పోటీదారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ఉద్యోగుల్లో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందించడంలో క్రీడల ప్రాధాన్యత అమూల్యమని తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహించబడతాయని పేర్కొన్నారు.కార్యక్రమం లో పీడీలు ఎం. శ్రీనివాస్, రమణారావ్, అన్నపూర్ణ, సత్తయ్య, అంబాజీ, భోజన్న, వెన్నెల, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## రాబోతున్న స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ కోరారు.



**వికారాబాద్,సెప్టెంబర్: 08.(సమయం న్యూస్) :** సోమవారం జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా,పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లోని ఛాంబర్లో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ....స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయితీలలో ఓటర్ల జాబితా,జిల్లాలో 2025, జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల వారి ఓటరు జాబితాననుసరించి గ్రామ పంచాయితీ, వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేయడం జరిగింది.అలాగే పోలింగ్ బూత్ ల జాబితా, పోలింగ్ కేంద్రాల విషయం ఏవేని అభ్యంతరాలు ఉన్నట్లు అయితే తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. జిల్లాలోని 594 గ్రామ పంచాయతీలలో 5058 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు . జిల్లాలో 6,98,478 ఓటర్లు నమోదు అయ్యారని, ఇందులో 343672 మంది పురుషులు,354790 మంది మహిళలు,16 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీపీఓ జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న తుది ఓటరు జాబితా

- కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్, సెప్టెంబర్ 08( సమయం న్యూస్).** జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం లో ర్యాలీ నిర్వహణ




**మహబూబ్ నగర్ సెప్టెంబర్08( సమయం న్యూస్). :** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అర్బన్ మండల విద్యాధికారి సహకారంతో జిల్లా కేంద్రంలోని పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులతో జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణం నుండి ర్యాలీని ప్రారంభించి అక్కడినుండి విద్యార్థులతో స్థానిక ఇన్స్ట్రక్షన్ బంగ్లా చౌరస్తా నుండి బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు చదువు ప్రాముఖ్యతను తెలిపే ప్లే కార్డ్స్ ద్వారా స్లొగన్స్ ఇస్తూ ర్యాలీని నిర్వహించారు

ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు ఏ.శ్రీనివాస్ రెడ్డి,సి ఎం ఓ సుధాకర్ రెడ్డి ,వయోజన శాఖ సిబ్బంది, స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చేతివ్రాత. ..చరిత్ర సృష్టించేలా

అక్షరాల అందం..
ఆలోచనలకు ప్రతిబింబం..
ఇంగ్లీష్ చేతివ్రాత
విద్యార్థులు సెల్ ఫోన్ లకు
సెలవు పెట్టేలా ప్రయత్నం..
జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న ప్రయోగం..
ఆత్మవిశ్వాసం మెండుగా..
చేతివ్రతతో చెదిరెన్ చింతల్..
ఇంగ్లీష్ చేతిరాతలో నైపుణ్యం పెంపొందించేందుకు కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
కొత్త కాన్సెప్ట్..

విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి చేతి రాత పోటీలు.. ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు..కలెక్టర్ నిర్ణయంతో సర్వత్ర హర్షాతిరేకం...తెలంగాణలో మోడల్ గా నిలిచిపోనున్న కరీంనగర్ జిల్లా..ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో శతాబ్దాలుగా ఎంతో విలువైనదిగా భావించిన మన చేతివ్రాతకు దాదాపుగా దూరమవుతున్నాం. ఈ రోజుల్లో మనం రాయడం దాదాపు మానేశాం. విద్యార్థులు సైతం రాయడానికి ఇబ్బంది పడుతున్నారు. బాల్యం నుండి బలపం పట్టే చేతులు సెల్ ఫోన్లకు బలవుతున్నాయి. పెన్సిల్, పెన్ పట్టే చేతులు మొబైల్, కంప్యూటర్ వాడటం వలన వ్రాయడం దాదాపు మరచిపోయేలా ఉన్నారు. చేతి వ్రాత వల్ల వచ్చే ప్రయోజనాలను కోల్పోతున్నారు. ప్రతిరోజు చేతితో కొన్ని పేజీలు వ్రాయడం వల్ల వయసు మళ్లిన తర్వాత వచ్చే మతిమరుపు వంటి వ్యాధులను నిరోధించడంతో సహా అనేక ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్న మాట. విద్యార్థుల్లో శ్రద్ధ, క్రమశిక్షణ, సహనాన్ని చేతివ్రాత పెంపొందిస్తుంది. స్పష్టత, అర్థవంతమైన వ్యక్తీకరణకు దోహదం చేస్తుంది, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం నింపుతుంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ ఈ ప్రయోజనాలను చేకూర్చే ఉద్దేశంతో, చేతి వ్రాతకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శ్రీకారం చుట్టారు. ప్రైవేటు పాఠశాలల యజమానులతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఎంవోయూలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టెట్ -ఎడ్, ఒలంపియాడ్, స్పెల్ -బి వంటి పోటీ పరీక్షలతో పాటు అనేక క్రీడా పోటీల్లో శిక్షణ ఇప్పించారు. ఈ తరహాలోనే కరీంనగర్ లోని పారమిత విద్యాసంస్థ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతి వ్రాత పోటీలను నిర్వహించాలని నిర్ణయించారు. 20.08.2025 న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాల స్థాయి చేతి వ్రాత పోటీలను నిర్వహించారు. ఇందులో నుండి ప్రతి పాఠశాలకు ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి 25.08.2025 న మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీదారుల నుండి మండలానికి ముగ్గురు చొప్పున విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ విధంగా జిల్లాలోని 16 మండలాల నుండి మొత్తం 584 మంది విద్యార్థులు మండల స్థాయిలో పోటీల్లో పాల్గొనగా జిల్లా స్థాయి తుది పరీక్షకు 48 మందిని ఎంపిక చేశారు. ఈనెల 7న పద్మ నగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఈ విద్యార్థులకు జిల్లాస్థాయి వ్రాతపరీక్ష పోటీలు జరిగాయి. 15.09.2025 న కరీంనగర్ కలెక్టరేట్లో జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో రెండు విభాగాల్లో ఇద్దరు విద్యార్థులను మొదటి బహుమతికి ఎంపిక చేసి రూ.5000 చొప్పున బహుమానం ఇవ్వనున్నారు. అదేవిధంగా రెండవ బహుమతిలో ఇద్దరు విద్యార్థులకు రూ.4000 చొప్పున మూడో బహుమతిలో ఇద్దరు విద్యార్థులకు రూ. 3000 చొప్పున, నాలుగో బహుమతిలో ఇద్దరు విద్యార్థులకు రూ. 2000 చొప్పున, ఐదవ బహుమతిలో ఇద్దరు విద్యార్థులకు వెయ్యి రూపాయల చొప్పున అందించనున్నారు. ప్రతి విభాగంలో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతి, మండల పాఠశాల స్థాయిలో ఎంపికైన ముగ్గురు విజేతలకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారు.

**అధికారులకూ పరీక్ష..** ఇంగ్లీష్ రాతలో నైపుణ్యం పెంపొందించేందుకు అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లోనూ పోటీ తత్వాన్ని అలవర్చేందుకు జిల్లా స్థాయి చేతివ్రాత పోటీలలో పాల్గొనేందుకు వారికి అవకాశం ఇచ్చారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, అధికారులు ఉద్యోగులు కూడా జిల్లాస్థాయి పోటీకి ఉత్సాహంగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు వ్రాత పరీక్షకు హాజరయ్యారు.

చేతి వ్రాత పరీక్ష పై అభిప్రాయాలు

(1) "జిల్లా స్థాయి ఇంగ్లీష్ హ్యాండ్రైటింగ్ పోటీలో నేను పాల్గొనడం నాకు గొప్ప అనుభవంగా నిలిచింది.

అందమైన లేఖన శైలి కేవలం అక్షరాల అందం మాత్రమే కాదు, మన ఆలోచనల స్పష్టతను కూడా ప్రతిబింబిస్తుంది.

ఈ పోటీ నాకు శ్రమ, సహనం, క్రమశిక్షణ ఎంత ముఖ్యమో నేర్పింది.

నిరంతర సాధనతో మన రాత అందంగా మారుతుంది, మన వ్యక్తిత్వానికి మరింత వెలుగులు చేరుతాయి.

ప్రతి ఒక్కరూ తమ హ్యాండ్రైటింగ్‌ను అభివృద్ధి చేసుకోవాలని, అది విద్యలోనూ జీవితంలోనూ విజయానికి తోడ్పడుతుందని నేను నమ్ముతున్నాను.

ఈ అమూల్యమైన అవకాశాన్ని కల్పించిన గౌరవనీయులైన కలెక్టర్ మేడమ్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు."లిలి

ఎనుగు ప్రభాకర్ రావు
MEO, గంగాధర

(2)"జిల్లా స్థాయి హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో పాల్గొనడం నాకు ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. ఎంతో సంతోషంగా అనిపించింది. ఈ పోటీ నా చిన్ననాటి విద్యార్థి జీవనాన్ని తలపింపజేసింది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో సృజనాత్మకతను, అక్షరాలపై మక్కువను పెంపొందిస్తాయి. భవిష్యత్తులో మరెంతో మంది పిల్లలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలనుకుంటున్నాను."

– శ్రీనివాస్ రెడ్డి, MEO సైదాపూర్

(3) మొబైల్, కంప్యూటర్ వాడటం వలన వ్రాయడం దాదాపు మరచిపోయేలా ఉన్నాం. ఈ సందర్భంగా కలెక్టర్ మేడం తీసుకున్న చేతివ్రిరాత పోటీల నిర్ణయం వల్ల మళ్ళీ నేను చేతివ్రాత పై మంచిగా దృష్టి పెట్టి, బాగా సాధన చేసి మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. జిల్లాస్థాయిలో మేడం తో పాటు నేను పోటీలో పాల్గొన్నందుకు చాలా గర్వపడుతున్నాను.

## ములుగులో పారిశుద్ధ్య కార్మికుడి మృతిపై కేటీఆర్ ఆరా

# కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

- పారిశుద్ధ్య కార్మికుడి మరణానికి కారణం అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం అన్న కేటీఆర్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క కార్మికుడి మరణానికి బాధ్యత తీసుకొని, 50 లక్షల ఎక్స్‌షియా చెల్లించాలని డిమాండ్
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే.
- కార్మికులకు కనీసం నెలనెలా జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిని తెచ్చినందుకు ముఖ్యమంత్రి, మంత్రి సీతక్క క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- ఫోన్‌లో మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

**హైదరాబాద్ సెప్టెంబర్08( సమయం న్యూస్).:** ములుగు మున్సిపాలిటీలో పనిచేస్తూ పెండింగ్ వేతనం రాకపోవడంతో కార్మికుడు మైదం మహేశ్ పురుగుల మందు తాగి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న కేటీఆర్, పారిశుద్ధ్య కార్మికుడి మృతిపై బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీశారు. ఈ మేరకు రెడ్‌కో మాజీ చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి కేటీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం మాధవరావుపల్లిలోని మృతుని ఇంటికి చేరుకొని పరామర్శించారు. అంతకు ముందు కేటీఆర్ పారిశుధ్య కార్మికుడి మరణం పైన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఐదునెలలుగా జీతాలు అందక ములుగు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుడు మహేష్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం అని కేటీఆర్ అన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే. కార్మికులకు కనీసం నెలనెలా జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిని తెచ్చినందుకు ముఖ్యమంత్రి, మంత్రి సీతక్క క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ములుగు నియోజకవర్గంలో జరిగిన ఈ దారుణ ఘటనకు మంత్రి సీతక్కతోపాటు.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలన్నారు. బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిపోయి, మంచినీళ్లు అనుకుని పురుగుల మందు తాగి మరణించాడని ఓ వీడియోను సృష్టించి ప్రచారం చేసుకోవడం మరో దుర్మార్గమని, ఇలాంటి చర్యలతో మీ ఘోర వైఫల్యాన్ని, చేతకానితనాన్ని ప్రజాక్షేత్రంలో కప్పిపుచ్చలేరని అధికారపక్షానికి చెందిన నేతలు గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, నెలల తరబడి పెండింగ్ పెడితే పేద కార్మికులు ఎలా బతకాలో ముఖ్యమంత్రి, మంత్రి సమాధానం చెప్పాలన్న కేటీఆర్, మృతుని కుటుంబానికి వెంటనే 50 లక్షల రుపాయల ఎక్స్ గ్రేషియాతోపాటు.. అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి. లేకపోతే బీఆర్ఎస్ పక్షాన బాధితుని కుటుంబంతోపాటు, కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు

ఈరోజు మధ్యాహ్నం కేటీఆర్ ఆదేశాలతో మృతుని కుటుంబం వద్దకు వెళ్లి పరామర్శించిన పార్టీ నేతలు, మహేష్ తల్లితో కేటీఆర్ ను మాట్లాడించారు. కేటీఆర్ ఆమెతో మాట్లాడి మైదం మహేశ్ చనిపోవడానికి గల కారణాలను అడిగారు. ఈ మేరకు మృతుని తల్లి కేటీఆర్‌తో ఫోన్ మాట్లాడుతూ గత 6 నెలలుగా వేతనం రాకపోవడంతో మనస్థాపంలో మృతి చెందాడని తెలియజేశారు. తన కొడుకుకు నలుగురు ఆడపిల్లలు కాగా గతంలో ఒక పాపకు గతంలో జ్వరంతో ఆ సమయంలో సైతం జీతం రాలేదని తెలియజేసింది. పైసల కోసం తిప్పలు పడితే ఒక రెండు వేలు మాత్రమే ఇచ్చారని, ఆ సమయంలో అవి సరిపోక బిడ్డ చనిపోయిందని వివరించారు. ఆరు నెలలగా జీతం పైసలు ఇవ్వకుండా ఇబ్బందులు చేస్తూ స్మశానంలో పనిచేయించారని, ఇంట్లో భార్య పిల్లలు, తిండి టికాన లేక అవస్థలు పడ్డారని వాపోయింది. కొన్ని రోజుల క్రితం మరో బిడ్డకు జ్వరం వస్తే బయట రెండు వేల రూపాయలు బాకీ తెచ్చి దావాఖానలో చూపించాడని, జీతం కోసం తిరిగి తిరిగి బాధకు గురైన నా కొడుకు మున్సిపాలిటీ వాళ్ళు స్మశాన వాటిక కోసం ఇచ్చిన గడ్డి మందును తాగి చనిపోయాడని తెలిపింది. మహేష్ తల్లి మాటలు విన్న కేటీఆర్ మనసు చెలించిపోయి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేసీఆర్ తరుపున ముగ్గురు ఆడబిడ్డలను ఆదుకుంటామని, పార్టీ తరుపున పిల్లల పేర్లపై ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. రెండు రోజులో సతీశ్‌రెడ్డితో సాయం అందిస్తారని అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. గతంలో ఇలాంటి ఇబ్బందులు ఉండేవా అని కేటీఆర్ అడిగిన క్రమంలో మహేశ్ తల్లి గతంలో ఇలా జీతం ఇబ్బందులు లేవని, ఆరు నెలల నుండి తన కొడుకు చేసిన కష్టం పైసల కోసం గోస పడ్డాడని తెలిపింది. అనంతరం మృతుని అన్న కుమార్తె మైదం జ్యోతి సతీశ్‌రెడ్డి దృష్టికి మైదం మహేశ్‌తో చనిపోయే ముందు ఎవరు లేని సమయంలో వచ్చి వీడియో తీయించుకున్నారని, నీళ్ళు అనికొని మందు తాగినట్లు చెప్పించారని తెలిపింది. తామంతా ఆ సమయంలో దావాఖానలోనే ఉన్నామని, రెండు, మూడు రోజుల నుండి నీళ్ళు కావాలని అడుగుతుండే వాడని, ఈ క్రమంలో కిరిటి, రఘు అనే ఇద్దరు వచ్చి తన బాబాయ్ అయిన మహేశ్‌తో వారికి అనుకూలంగా మాటలు మాట్లాడించుకొని వీడియోను తీశారని, జీతం రాకపోవడం, వారు పెట్టిన ఇబ్బందుల వల్లనే చనిపోయాడని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ తరుపున సాయం అందిస్తామని, మహేశ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వంతో కొట్లాడుతామని సతీష్ రెడ్డి తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, నాయకులు పోరిక పోమానాయక్, వేముపల్లి భిక్షపతి, పోరిక విజయ్‌రామ్‌నాయక్, గజ్జి నగేశ్, కోగిల మహేశ్, ఆకుతోట చంద్రమౌళి, గరిగె రఘు తదితరులు ఉన్నారు.

# ఓటరు జాబితా పై వివిధ రాజకీయ పార్టీల తో ఎంపీడీఓ సమావేశం

**కొడంగల్, సెప్టెంబర్,08,(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు ముసాయిదా జాబితా పై సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. త్వరలోనే జరిగే ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల నేపథ్యంలో ఓటరు ముసాయిదా, పోలింగ్ స్టేషన్ ల జాబితాను పంచాయతీ వార్డుల వారీగా విడుదల చేయడం జరిగిందని ఎంపీడీఓ తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు బుస్స చంద్రయ్య, మురళీ ధర్ రెడ్డి,జి. రమేశ్ బాబు తదితరులు ఉన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి EHSవిధి విధానాలు సిద్ధం చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె.రామకృష్ణా రావు
- ప్రతిపాదిత EHS విధి విధానాలపై
- డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం
- సీనియర్ ఐఏఎస్ అధికారులతో సి.ఎస్ సమీక్షించారు.



**హైదరాబాద్, సెప్టెంబర్ 08:** గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో, ఇతర రాష్ట్రాలలో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి అమలవుతున్న వివిధ పథకాలను, ఇన్సురెన్స్ కంపెనీల విధానాలను అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరలో నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ వేతనం నుండి కొంత డబ్బును జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, నగదు రహిత ఆరోగ్య చికిత్స విధానం ద్వారా (Cashless Treatment) ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కేర్ అందించాలని ఉద్యోగులు కోరుతున్నారని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మొత్తం కలిపి 7 లక్షల 14 వేల 322 మంది EHS (Employees Health Scheme) ద్వారా లబ్ది పొందనున్నారని, ఈ పథకం కోసం సంవత్సరానికి సుమారు రూ.1300 కోట్ల అంచనా వ్యయం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో ఆయా రాష్ట్రాలలో కొనసాగుతున్న EHS విధి విధానాలను అధ్యయనం చేసి త్వరలో నివేదికను సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హెూం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి డా.యోగితా రాణా ఆరోగ్య శాఖ కార్యదర్శి డా.క్రిస్టినా చోంగ్తు, , GAD కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యూరియా సరిపోను నిల్వలు.

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్



**సూర్యాపేట సెప్టెంబర్ 08( సమయం న్యూస్) :** జిల్లాలో సరిపోను యూరి యా నిల్వలు ఉన్నాయని రైతులెవరు అధైర్య పడవద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రక టనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం అయన ఒక ప్రకటన విడుదల చేస్తూ సూర్యాపేట జిల్లా లో సోమవారం 640 మెట్రిక్ టన్నులలో 520 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయని, ఇంకా 120 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే మంగళవారం (9.9.2025) న అదనంగా 420 మెట్రిక్ టన్నుల యూరియా అన్ని పిఎసిఎస్ మరియు డీలర్ కేంద్రాల్లో అందుబాటులోకి వస్తుందని, దానితో కలుపుకొని మొత్తం గా 540 మెట్రిక్ టన్నుల యూరియా నిలువలు జిల్లాలో ఉంటాయని స్పష్టం చేశారు. రానున్న రెండు రోజుల్లో జిల్లా కు మరో 860 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా అవుతున్నదని తెలిపారు. రైతులకు సకాలంలో యూరియా అందించే విధంగా ప్రభుత్వం తగు చర్యలు చేస్తున్నదని, అందువల్ల రైతులెవ్వరు ముందస్తుగా యూరియా కొనుగోలు చేసి నిల్వ చేయకూడదని కోరారు.

## పేషంట్లు ఆరోగ్య వంతంగా ఉండేందుకు ఫిజియోథెరపీని వినియోగించుకోవాలి.

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.



**జనగాం సెప్టెంబర్ 08(సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు కావలసిన వైద్య సౌకర్యాలను దరి చేర్చాలని గొప్ప ఉద్దేశంతో వైద్య సౌకర్యాలను మెరుగుపరుస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జిల్లా వైద్యాధికారి డా. కె. మల్లికార్జున్ రావు గారితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనేక రకాల వ్యాధుల నుండి త్వరగా కోలుకోవడంలో ఫిజియోథెరపీ ఎంతో పనిచేస్తుందన్నారు. ప్రజలు తప్పనిసరిగా ఫిజియోథెరపిస్టుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు చురుకుగా, ఆరోగ్యంగా, స్వతంత్రంగా జీవించేందుకు ఫిజియోథెరపిస్టులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఎ. మధుకర్ యాదవ్,(RMO) జనగాం GGH, ఫిజియోథెరపీ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# పూల వ్యర్థాలను మురుగు కాలువలో వేయకుండా అవగాహన కల్పించండి

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
- వరంగల్ పోస్టాఫీస్ ప్రాంతం లో క్షేత్ర స్థాయి తనిఖీలు...
- పూల వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేయాలని ఆదేశం..



**వరంగల్ సెప్టెంబర్08( సమయం న్యూస్). :** పూల వ్యర్థాలను డ్రైన్ లలో వేయకుండా పూల వ్యాపారులకు అవగాహన కల్పించాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అభిప్రాయ పడ్డారు. శానిటేషన్ తనిఖీల్లో భాగం గా మేయర్ సోమవారం వరంగల్ పోస్టాఫీస్ ప్రాంతం లో క్షేత్ర స్థాయి లో డ్రైన్ ల స్థితి గతులను పరిశీలించి సమర్ధవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరంగల్ పరిధి లోని పోస్ట్ ఆఫీస్ ప్రాంతం లో రోడ్డు పైకి వరద నీరు చేరి ప్రజలకు వ్యాపారులకు ఇబ్బందులు కలిగిన నేపథ్యంలో ఇందుకు కారణమైన పూల వ్యర్ధాలు గుమ్మడికాయల వ్యర్ధాలతో పాటు ప్లాస్టిక్ ఉత్పత్తులు డ్రైన్ లలో కి చేరి ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా మారాయని గుర్తించడం జరిగిందని, ఈ ప్రాంతంలోని స్టేక్ హెూల్డర్ లు పూల వ్యాపారులు లకు తగు సూచనలు చేస్తూ పూల వ్యాపారులు వారి వ్యాపారాలను విధిగా నిర్వహించుకుంటూ కార్పొరేషన్ కు సహకరించాలని పూలకు సంబంధించిన ఏర్పడే అంతిమ ఉత్పన్నాలను దుకాణ దారు ఒక డబ్బా ను ఏర్పాటు చేసుకొని అందులో వేసి తమ వద్దకు వచ్చే బల్దియా చెత్త సేకరణ వాహనాలకు అందివ్వాలని డ్రైనేజీలను పూల ఉత్పత్తులను వేసి నీరు ప్రవహించకుండా అడ్డుపడితే కార్పొరేషన్ పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇటీవల వీటి ఉత్పన్నాలు డ్రెయిన్ల లోకి చేరడం వల్ల నీరు ప్రవహించక వరద నీరు రోడ్డు పైకి చేరిందని కావున పూల వ్యాపారస్థులు మీ షాపు ఏరియా లో ఉన్న ప్రాంతాన్ని శుభ్రం గా ఉంచుకుంటూ కార్పొరేషన్ కు సహకరించాలని,అధికారులకు సూచనలు చేస్తూ పూల వ్యాపారులు వారికి వీలైన సమయాన్ని తెలియజేస్తే అందుకు అనుగుణం గా వారికి చెత్త సేకరణ వాహనాన్ని వీలైతే రెండు పర్యాయాలు సమకూర్చాలని మేయర్ అన్నారు. పోస్ట్ ఆఫీస్ ప్రాంతం లో బల్దియా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న ఫ్లవర్ కంపోస్ట్ యూనిట్ ను మేయర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి అధికారులను నిర్వహణ తీరును అడిగి తెలుసుకుని ఫ్లవర్ కాంపోస్టు ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రత్యేకంగా పూల వ్యర్థాలను పెద్ద మొత్తం గా సేకరించి వాటి నుండి వచ్చిన కంపోస్ట్ ను మొక్కల పెరుగుదలకు వినియోగించాలని, ఈ సందర్భం గా ప్రధాన రహదారి నుండి సి కే ఎం ఆసుపత్రి కి వెళ్ళే మార్గం లో ఏర్పడ్డ లీకేజీ నీ స్థానికులు మేయర్ దృష్టికి తీసుకురాగ వెంటనే అరికట్టాలని ఏఈ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఇంచార్జ్ ఎస్ ఈ మహేందర్ ఏం హెచ్ ఓ డా.రాజేష్ ఇంచార్జి ఈ ఈ సంతోష్ బాబు డి ఈ సతీష్ సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్ గోల్కొండ శ్రీను ఏ ఈ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.'

## సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ వైస్ చేర్పర్సన్



**కొడంగల్, సెప్టెంబర్,08,09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి రాజేందర్ సోమవారం ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ని హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సాకేత్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో 61 ఫిర్యాదులు సమస్యల పరిష్కారంపై కలెక్టర్ దృష్టి,



**సంగారెడ్డి సెప్టెంబర్08( సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదేశించారు . కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 61 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కి పింఛన్లు, సంక్షేమ పథకాలు, భూ వివాదాలు, ఆరోగ్యం, విద్య, తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ప్రజలు తమ సమస్యలకు అధికారులనుండి స్పందన లభించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

## ఇద్దరు నిందితుల అరెస్టు : 16 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం



**ఖమ్మం , సెప్టెంబర్ 8 :( సమయం న్యూస్ ) :** వాహనాల తనిఖీ సందర్భంగా అనుమానస్పదంగా కనిపించి , పరారవుతున్న ఇద్దరు నిందితులను ఖమ్మం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి, వారి నుండి 16 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టూ టౌన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఖమ్మం ఎసిపి రమణమూర్తి వెల్లడించారు. టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ పోలీస్ సిబ్బంది ఎన్ ఎస్ టి రోడ్ లో వాహనాల తనిఖీ చేస్తున్న సందర్భంగా వీరిని అరెస్ట్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గల వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు కేసులలో ఇద్దరు నిందితులు . చైన్స్ స్నాచింగ్ తో పాటు ఇంటి తాళాలను పగలగొట్టి బంగారం వెండి వస్తువులను వీరిద్దరూ అపహరించేవారు. ఖమ్మం నగరం ముస్తఫా నగర్ ప్రాంతానికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు , భద్రాచలం లోని శ్రీరామ నగర్ కాలనీకి చెందిన దేవన బోయిన మహేష్ కాగా మొదటి నిందితుడు కారు డ్రైవర్ రెండో నిందితుడు బట్టల షాపులో సేల్స్ మెన్ గా పనిచేస్తూ దొంగతనాలకు అలవాటు పడ్డారు. బంగారం వెండి వస్తువులతో పాటు ఒక సోనీ టీవీ ,నాలుగు సౌండ్ బాక్సులు, రెండు ద్విచక్ర వాహనాలను నిందితుల నుండి పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. వీటి విలువ సుమారు 16 లక్షల వరకు ఉంటుందని ఏసీబీ రమణమూర్తి తెలిపారు.



**కొడంగల్,సెప్టెంబర్,08.09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ రోడ్డు విస్తరణలో కోల్పోయే కొడంగల్ పట్టణంలోని మక్కా మస్జిద్ ముందు ఉన్న దుకాణ సముదాయాలకు పరిహారం అందించాలని మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ2009లో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో రోడ్డు విస్తరణలో భాగంగా కొడంగల్ పట్టణంలోని మక్కా మసీదు ముందు ఉన్న దుకాణాలను రేవంత్ రెడ్డి హామీ మేరకు తొలగించడం జరిగిందన్నారు. దుకాణ సముదాయలకు సంబంధించిన పరిహారాన్ని అందించకపోయినా మక్కా మస్జిద్ ముందు దుకాణ సముదాయాలను నిర్మించుకున్నామన్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో దుకాణాలను తొలగించాలని అధికారులు చెబుతుండడంతో పరిహారం అందించేందుకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు.

## హయత్‌నగర్ డివిజన్‌లో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనుల పరిశీలన



**సెప్టెంబర్ 08 (సమయం న్యూస్) :** హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారా కాలనీలో ఉన్న హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ శ్రీ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ హేము నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీ సురేష్, బీజేపీ నాయకులు శ్రీ ఎర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.స్థానిక ప్రజల సౌకర్యార్థం మరియు స్మశాన వాటిక సౌలభ్యం కోసం కార్పొరేటర్ గారి చొరవతో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.కార్పొరేటర్ కార్యాలయం, హయత్‌నగర్ డివిజన్.

## పెద్దాపూర్ గ్రామైక్య సంఘం కు ప్రత్యేక అభినందనలు



**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 08( సమయం న్యూస్) :** పెద్దాపూర్ గ్రామైక్య సంఘం కు ప్రత్యేక అభినందనలు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం పెద్దాపూర్ గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు డి.విజయ ను అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సెప్టెంబర్ 5 హైదరాబాద్ శిల్పారామం లో జరిగిన గురుపూజ మహోత్సవం కార్యక్రమంగా ముఖ్యమంత్రి చేతులమీదుగా వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు ప్రశంస పత్రాలు సన్మానం చేయడం జరిగిందని, మన పెద్దపల్లి జిల్లాలో పెద్దాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ గ్రామైక్య డి. విజయ ను సీఎం సన్మానించారు.అతి తక్కువ సమయంలో ఆదర్శ పాఠశాలను ఆధునికరించడం, 2024 లోనే జిల్లాలోని అత్యధికంగా ధాన్యం సేకరించడంతో గడువులోగా స్కూల్ యూనిఫామ్ అందజేయడం సంక్షేమ పథకాల అమలు వనమహోత్సవం అక్షరాస్యతలు చురుగ్గా వ్యవహరిస్తున్నందుకు విజయకు రాష్ట్ర ప్రభుత్వం పురస్కారం అందించిందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన మహిళా సంఘం ప్రతినిధికి కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ కాళిందిని, అడిషనల్ డి.ఆర్డి.ఓ రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి పట్టుబడ్డ ఆర్ ఐ అమర్నాథ్ రెడ్డి



**మద్దూరు,సెప్టెంబర్,08,09(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం మద్దూరు మండలంలోనిఅప్పిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఒక రైతుకు సంబంధించి ఐదు గుంటల పొలాన్ని పాస్బుక్లో ఎంట్రీ చేసేందుకు 5000 రూపాయల లంచం డిమాండ్ చేశాడు ఆ రైతు ఎంత వేడుకున్న ఆర్ ఐ వినకుండా డబ్బులు ఇస్తే గాని పని జరగదు అని తేల్చి చెప్పాడు. తప్పని పరిస్థితుల్లో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.ఈ మేరకు సోమవారం పక్కా ప్రణాళికలతో మహబూబ్ నగర్ ఏసీబీ, డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో వారి సిబ్బంది కలిసి లంచం డబ్బులను పట్టుకొని ఆర్ ఐ ని అదుపులోకి తీసుకున్నారు.ఈ మేరకు కార్యాలయంలో మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు

## జిల్లా లో అదనంగా 16 విరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాల పల్లి సెప్టెంబర్08( సమయం న్యూస్).:** రైతులకు ఎరువుల విక్రయాల్లో రద్దీ తగ్గించి సౌకర్యవంతమైన విధంగా పంపిణీ చేయడానికి అదనంగా 16 ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారుసోమవారం ఐడిఓసి కార్యాలయంలో వ్యవసాయ శాఖ, సహకార శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనంగా ఏర్పాటు చేయనున్న 16 ఎరువుల విక్రయ కేంద్రాలకు ఈ-పాస్ యంత్రాలను పంపిణీ చేశారు.రైతులు సమయానికి ఎరువులు పొందేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామ పేర్కొన్నారు. రైతులు రద్దీ తగ్గించేందుకు అదనపు ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అదనపు ఎరువుల విక్రయ కేంద్రాలు సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబడ తాయని ఆయన తెలిపారు. రైతు అవసరాలు తీర్చడం మన అందరి బాధ్యతని, ఎరువుల సరఫరా సమయానికి జరిగేలా వ్యవసాయ, సహకార శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వాల్యా నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

**- నగర మేయర్ గుండు సుధారాణి**

**- ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాట్ల పై సమీక్ష...**



**వరంగల్ సెప్టెంబర్ 08( సమయం న్యూస్).:** పితృ అమావాస్య,సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు.సోమవారం జీడబ్ల్యు ఎంసీ ప్రధాన కార్యాలయం లో పితృ అమావాస్య (బతుకమ్మ ప్రారంభ వేడుక)సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను పురస్కరించుకొని బల్దియా వ్యాప్తం గా 66 డివిజన్ లలో చేయాల్సిన ఏర్పాట్ల పై ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్పాల్గొని సమ-ర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు.బల్దియా ఆధ్వర్యంలో ఇటీవల గణేష్ నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించడంపై, అదేవిధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాల వరదలలో క్షేత్ర స్థాయిలో సమిష్టిగా విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి మేయర్ అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో పితృ అమావాస్య, దసరా, బతుకమ్మ ఏర్పాట్లు చేయాలని కోరారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ జరుపుకుంటారని వారి సౌకర్యార్థం అవసరమగు ఏర్పాట్లు చేయాలన్నారు. బల్దియావ్యాప్తంగా బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద మైదానం చదును, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలతో పాటు చెరువులలో గుర్రెపు డెక్క తొలగించాలని,ఆయా పనులు వేగవంతంగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. బతుకమ్మల నిమజ్జనం నిమిత్తం బల్దియా పరిధిలోని చిన్న వడ్డేపల్లి, కట్ట మల్లన్న , ఉర్సు గుట్ట, రంగ లీలా మైదానం, తోట మైదానం, శివనగర్ గ్రౌండ్, రంగసాయిపేట, ఖిలా వరంగల్, బేస్తం చెరువు, మామునూరు పెద్ద చెరువు, బంధం చెరువు, భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాల గుడి దేవాలయం, మెట్టుగుట్ట, పద్మాక్షి టెంపుల్, మడికొండ చెరువు, తదితర చెరువులలో గుర్రపు డెక్క తొలగింపు, ఎలాంటి లోటుపాట్లకు, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతోఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఇంచార్జ్ ఎస్ ఈ మహేందర్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఈఈ లు రవికుమార్ సంతోష్ బాబు డిఈ లు రవి కిరణ్ సారంగం రాజ్ కుమార్ కార్తీక్ రెడ్డి సతీష్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## తరగతి గదుల్లో టీచర్ల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- టీచర్స్ డే ను పురస్కరించుకొని
- సమీకృత జిల్లా కలెక్టరేట్ లో
- నిర్వహించిన గురుపూజోత్సవం
- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, సెప్టెంబర్-08:-** తరగతి గదుల్లో టీచర్ల పాత్ర కీలకమని , ఒక టీచర్ ఒక విద్యార్థి జీవితాన్ని పూర్తిగా మార్చే సామర్థ్యం ఉంటుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో టీచర్స్ డే సందర్భంగా నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. స్వాగతం నృత్యం అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మన జిల్లాలో మిగిలి ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు 6 నెలలో పూర్తి చేస్తామని అన్నారు. మన జిల్లాలో అవసరమైన మేర ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంలో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ కోరారు. తరగతి గదులలో డిజిటల్ క్లాస్ రూమ్ అదనపు సౌకర్యం మాత్రమేనని, టీచర్లు మాత్రమే కేంద్రంగా తరగతి గదులు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన గతంతో పోలిస్తే చాలా మెరుగైందని అన్నారు. పిల్లలు చదవడం, రాయడం అనర్గళంగా మాట్లాడటం నేర్పించడంలో కొంత వెనుకబడి ఉన్నామని అన్నారు. ఉపాధ్యాయులంతా కలిసి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా పద్ధతులను ఇంప్రూవ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రతి ప్రాథమిక పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ కనీసం 80 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు ఉండేలా చూడాలని కలెక్టర్ ఉపాధ్యాయులను కోరారు. పిల్లలపై ఉపాధ్యాయులు చూపించే ప్రభావం జీవిత కాలం గుర్తుంటుందని అన్నారు. సమాజంలో చాలామంది జీవితాల్లో వెలుగు నింపే అవకాశం ఉపాధ్యాయులకు లభించిందని, దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 48 మంది టీచర్లకు ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వేణు, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జడ్పీ సీఈవో నరేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల సమన్వయం తో అది కర్మ యోగి అభియాన్ మిషన్ ను గ్రామ స్థాయిలో విజయవంతం చేయాలి.

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**భూపాల పల్లి సెప్టెంబర్ 08( సమయం న్యూస్) :**ఆది కర్మయోగి అభియాన్ మిషన్ ను గ్రామస్థాయిలో మూవ్ మెంట్ లాగా అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ మిషన్ పై మిషన్ భగీరథ, విద్య, వైద్య, డిఆర్డిఓ, గిరిజన సంక్షేమ, మహిళా సంక్షేమ, అటవీ తదితర శాఖల అధికారులతో డిస్ట్రిక్ ప్రాసెస్ ల్యాబ్ అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో కాటారం, పలిమెల, మహా ముత్తారం, మహాదేవపూర్ మండలాల్లోని 37 గిరిజన గ్రామాలను ఆదికర్మ యోగి అభియాన్ మిషన్ కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్రతిష్టాత్మకమైన సుపరిపాలనకు 17 శాఖల సమన్వయంతో ప్రతి పౌరునికి ప్రభుత్వ పథకాలు అందేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో డిస్టిక్ ప్రాసెస్ ల్యాబ్ గా ఎంపిక చేసిన సిబ్బందికి కార్యక్రమ అమలుపై 15 అంశాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అవగాహన పొందిన సిబ్బంది గిరిజన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు చేపట్టబడిన ఈ పథకాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ విజయవంతం చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుపరిపాలన, సేవల్లో పారదర్శకంగా ఉండాలన్న లక్ష్యంతో చేపట్టారని తెలిపారు. అర్హులకు సంక్షేమ పథకాలు అమలయ్యేలా పనిచే యటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యామని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ఈ కార్యక్రమం ద్వారా గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అన్ని శాఖల సిబ్బంది ఆదికర్మ యోగి మిషన్ పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, ఏదేని సమస్య వస్తే ఇది నా శాఖకు సంబంధించినది కాదన్న ధోరణిలో వ్యవహరించొద్దని ఆయన సూచించారు. ఏదైనా సమస్య ఒక శాఖ దృష్టికి వచ్చినట్లయితే ఆ శాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు.వచ్చిన ప్రజల సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవటమే మన ముందున్నటువంటి ప్రధాన కర్తవ్యమ నిఆయన పేర్కొన్నారు. ఈ మూడు రోజుల అవ గాహన సమగ్ర కార్యాచరణ తయారుచేసి అన్ని గ్రామ పంచా యతీల్లో అవగాహన నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల అమలు ద్వారా గ్రామ స్థాయిలో మంచి ఫలితాలు రావాలని ఆయన పేర్కొ న్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డిఆర్డిఓ బాలక్రిష్ణ, డీఈఓ రాజేందర్, మిషన్ భగీరథ ఈఈ శ్వేత, మహిళా సంక్షేమ అధికారి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా కప్ 2025 టోర్నీకి అంతా సిద్ధం




## యూఏఈ వేదికగా టీ20 ఫార్మాట్





గత రెండు నెలలుగా ధనాధన్ బ్యాటింగ్ కోసం వేచి చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెరపడే సమయం ఆసన్నమైంది. ఐపీఎల్ 2025 సీజన్ ముగింపుతో మూగబోయిన బ్యాట్లు.. ఇక సిక్సర్లు, బౌండరీల మోతతో దద్దరిల్లనున్నాయి. అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్న ఆసియా కప్ 2025 టోర్నీకి మంగళవారం తెరలేవనుంది. యూఏఈ వేదికగా టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీ కోసం ఆసియా క్రికెట్ దేశాలు సిద్ధమయ్యాయి. ఆతిథ్య యూఏఈతో పాటు భారత్, పాకిస్థాన్, ఒమన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, హాంగ్ కాంగ్‌లు బరిలోకి దిగుతున్నాయి. భారత కాలమానం ప్రకారం మ్యాచ్‌లన్నీ రాత్రి 8 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ నెల ఆసాంతం జరగనున్న ఈ టోర్నీ అభిమానులకు కావాల్సిన అసలు సిసలు మజా అందివ్వనుంది. అఫ్గానిస్థాన్, హాంగ్ కాంగ్ మధ్య అబుదాబి వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఇరు జట్లు యూఏఈకి చేరుకున్నాయి. అఫ్గానిస్థాన్ ఇక్కడ ట్రై సిరీస్ కూడా ఆడింది. ఫైనల్లో పాకిస్థాన్ చేతిలో ఓడినా.. లీగ్ దశలో ఆ జట్టును ఓడించింది. భారత్ తర్వాత పటిష్టంగా కనిపిస్తోంది. ఆసియాలో భారత్ తర్వాత తామే అత్యంత పటిష్టమైన జట్టుగా నిరూపించుకునేందుకు ఈ టోర్నీని ఉపయోగించుకోవాలని అఫ్గాన్ భావిస్తోంది. హాంగ్ కాంగ్‌తో పోరులో అఫ్గాన్ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ సునాయస విజయాన్నందుకుంటుంది. మరోవైపు హాంగ్ కాంగ్ మూడో సారి ఆసియా కప్ బరిలోకి దిగుతోంది. కానీ అఫ్గాన్‌కు పోటీనిచ్చే సామర్థ్యం అయితే హాంగ్ కాంగ్‌కు లేదు.

**అఫ్గానిస్థాన్ జట్టు:**
రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, దర్వీష్ రసూలి, సెదిఖుల్లా అటల్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, కరీం జనత్, మహ్మద్ నబీ, గుల్బదిన్ నైబ్, షరాఫుద్దీన్ అష్రఫ్, మహ్మద్ ఇషాక్, ముజీబ్ ఉర్ రెహమాన్, అల్లా ఘజన్‌ఫర్, నూర్ అహ్మద్, ఫరీద్ మాలిక్, నవీన్-ఉల్-హక్, ఫజల్హక్ ఫరూఖీ.

**హాంగ్ కాంగ్ జట్టు:**
యాసిమ్ ముర్తాజా (కెప్టెన్), బాబర్ హయాత్, జీషాన్ అలీ, నియాజకత్ ఖాన్ మహ్మద్, నస్రుల్లా రాణా, మార్టిన్ కోయెట్జీ, అన్షుమాన్ రథ్, కల్హాన్ మార్క్ చల్లు, ఆయుష్ ఆశిష్ శుక్లా, మహ్మద్ ఐజాజ్ ఖాన్, అతీక్ ఉల్ రెహ్మాన్ ఇక్బాల్, కించిత్ షా, ఆదిల్ మెహమూద్, హరూన్ మహ్మద్ అర్షద్, అలీ హసన్, షాహిద్ వాసిఫ్, ఘజాన్‌ఫర్ మహ్మద్, మహ్మద్ వహీద్, అనాస్ ఖాన్.

## టీమిండియాకు షాకింగ్ ఓటమి ఇచ్చేందుకు తొడకొట్టిన పసికూన..?

ఆసియా కప్ 2025లో మరో ట్రోఫీ గెలిచేందుకు భారత జట్టు సిద్ధంగా ఉంది. టోర్నమెంట్ మంగళవారం (సెప్టెంబర్ 9) ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఒక రోజు అంటే బుధవారం నాడు భారత జట్టు తన మొదటి మ్యాచ్‌ను యూఏఈ తో ఆడనుంది. 14వ తేదీన, పాకిస్తాన్ తో, 19వ తేదీన ఒమన్ తో తలపడనుంది. టోర్నమెంట్‌లో ట్రోఫీని గెలుచుకునేందుకు భారత జట్టు ఓ బలమైన పోటీదారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాగితంపై మిగతా జట్లు జట్లు బలహీనంగా కనిపిస్తున్నాయి. కానీ క్రికెట్‌లో ఎప్పుడైనా అపజయాలు జరగవచ్చు. ముఖ్యంగా దిగ్గజ జట్లకు కూడా ఊహించని షాక్ తగలవచ్చు. ఇప్పటికే ఇలాంటి ఓటముల బారిన పడిన జట్లు కూడా ఉన్నాయి. ఓమన్ ఆల్ రౌండర్ సుఫియాన్ మహమూద్ తన జట్టు ఆసియా కప్‌లో కొన్ని ఆటుపోట్లను సృష్టించగలదని నమ్ముతున్నాడు. ఆసియా కప్‌లో తొలిసారి పాల్గొంటున్న ఓమన్ జట్టు సెప్టెంబర్ 12న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పాకిస్థాన్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఓమన్ సెప్టెంబర్ 15న యూఏఈతో, సెప్టెంబర్ 20న భారత్‌తో తలపడనుంది. మహమూద్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తన జట్టు ప్రత్యర్థులకు సమస్యలు సృష్టించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. "ఇలాంటి టోర్నమెంట్‌లో ఆడుతున్నప్పుడు, నిర్భయంగా ఉండాలి. ఎందుకంటే కోల్పోవడానికి ఏమీ లేదు. మీ ప్రతిభను ప్రదర్శించడానికి, మీరు భయాన్ని అధిగమించాలి. మనం ప్రస్తుతం ఆడుతున్నట్లుగా, మంచి క్రికెట్ ఆడటం కొనసాగిస్తే, మనం నిరాశను కూడా ఎదుర్కోగలమని నేను నమ్ముతున్నాను. ఇది ఒక పెద్ద ప్రకటనలా అనిపించవచ్చు, కానీ ఈ టోర్నమెంట్‌లో మేం బలమైన ప్రభావాన్ని చూపగలమని నాకు పూర్తిగా నమ్మకం ఉంది" అని ఆయన అన్నారు. గత సంవత్సరం టీ20 ప్రపంచ కప్ తర్వాత ఓమన్ క్రికెట్ బోర్డుతో కాంట్రాక్ట్ వివాదాల కారణంగా వారి మొదటి ఎంపిక ఆటగాళ్లలో ఎక్కువ మంది అందుబాటులో లేరు. కాబట్టి, ఆసియా కప్‌లో ఓమన్ రెండవ శ్రేణి జట్టును కలిగి ఉంటుంది. ఈ టోర్నమెంట్ వారికి చాలా ముఖ్యమైనదని, ముఖ్యంగా భారత్, పాకిస్తాన్ వంటి భారీ జట్లతో మ్యాచ్‌లు ఆడాలని మహమూద్ నొక్కి చెప్పుకొచ్చాడు. ఆసియా కప్ గురించి ఓమన్ కెప్టెన్ జితేంద్ర సింగ్ తన ఉత్సాహాన్ని వ్యక్తం చేశాడు. ఇది తనకు భారతదేశంలోని కొంతమంది అత్యుత్తమ స్టార్లతో సంభాషించే అవకాశాన్ని ఇస్తుంది. గత సంవత్సరం పురుషుల ఎమర్జింగ్ ఆసియా కప్‌లో అభిషేక్ శర్మతో ఆడాడు. శుభ్‌మాన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్‌లను మళ్ళీ కలవడానికి అతను చాలా ఉత్సాహంగా ఉన్నాడు. ఈ ఆటగాళ్లతో సంభాషించాలని, వారి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలని, వారు తమ ప్రణాళికలను ఎలా సిద్ధం చేస్తారో, అమలు చేస్తారో తెలుసుకోవాలని కోరుకుంటున్నానని జితేంద్ర సింగ్ అన్నాడు.



# 2025 యూఎస్ ఓపెన్ విజేతగా అల్కరాజ్

**రూ.44 కోట్ల ప్రైజ్? మనీ సొంతం**

**రెండోసారి యుఎస్ ఓపెన్ టైటిల్ సొంతం**

**జానిక్ సిన్నర్‌ను మట్టికరిపించిన అల్కరాజ్**

యూఎస్ ఓపెన్ 2025 టైటిల్‌ను గెలుచుకున్న స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కరాస్, ట్రోఫీతో పాటు భారీ ప్రైజ్ మనీ సొంతం చేసుకున్నాడు. 6-2, 3-6, 6-1, 6-4తో జానిక్ సిన్నర్‌ను ఓడించి తన కెరీర్‌లో రెండోసారి యుఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఇది అతడి ఆరో గ్రాండ్ స్లామ్ టైటిల్ కావడం విశేషం. న్యూయార్క్‌లోని గ్రాండ్ స్లామ్ విక్టరీ సెప్టెంబర్ 2023 తర్వాత మొదటిసారిగా కార్లోస్ అల్కరాస్?ను నెంబర్ 1 ర్యాంకింగ్ స్థానానికి తిరిగి తీసుకువచ్చింది. 22 ఏళ్ల కార్లోస్ అల్కరాస్, ఓపెన్ ఎరాలో అత్యధిక సార్లు పురుషుల సింగిల్స్ ఛాంపియన్లను గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో ఓడించిన అతి పిన్న వయస్సు ఆటగాడిగా నిలిచాడు. 2011లో నోవాక్ జోకోవిచ్ తర్వాత ఘనత సాధించిన మొదటి ఆటగాడుగా నిలిచాడు. ఇప్పుడు యుఎస్ ఓపెన్ ట్రోఫీతో పాటు ఏకంగా రూ.44 కోట్లు ఖాతాలో వేసుకున్నాడు. రన్నరప్ గా నిలిచిన సినర్ రూ.22 కోట్లు దక్కించుకున్నాడు. రెండోసారి యూఎస్ ఓపెన్ ఛాంపియన్‌గా నిలిచిన అల్కరాస్?కు గతంలో కంటే 39 శాతం ఎక్కువ ప్రైజ్ మనీ లభించింది. అయితే, ప్రైజ్ మనీలో ఇంత పెరుగుదల ఎందుకు? అల్కరాస్?కు అంత ఎక్కువ డబ్బు ఎందుకు వచ్చింది?అయితే ప్రైజ్? మనీ పెరుగుదలకు కారణం టోర్నమెంట్ ప్రారంభానికి ముందే ప్రైజ్ మనీని పెంచడం. గత సంవత్సరం వరకు యూఎస్ ఓపెన్‌లో విజేతకు 3.6 మిలియన్ డాలర్లు (సుమారు 31.74 కోట్ల రూపాయలు) లభించేవి. కానీ 2025లో ఈ ప్రైజ్ మనీని 39 శాతం పెంచి 5 మిలియన్ డాలర్లు (సుమారు 44 కోట్ల రూపాయలు) చేశారు. అల్కరాస్?కు ఈ భారీ మొత్తమే లభించింది. రన్నరప్ అయిన యానిక్ సిన్నర్‌కు దానిలో సగం అంటే, సుమారు 22 కోట్ల రూపాయలు లభించాయి. విజయం అనంతరం అల్కరాస్ మాట్లాడుతూ %-% 'నేను ఇప్పుడు నా కుటుంబం కంటే సిన్నర్‌ను ఎక్కువగా చూస్తున్నాను. అతనితో కోర్ట్, లాకర్‌రూమ్ షేర్ చేసుకోవడం గర్వంగా ఉంది' అని నవ్వుతూ అన్నాడు. తన శిష్యుడు అద్భుతంగా ఆడాడని కోచ్ జువాన్ కార్లోస్ ఫెర్రెరో ప్రశంసించగా, అల్కరాజ్ కూడా 'నేను పర్ఫెక్ట్‌గా ఆడాను. సిన్నర్‌ను ఓడించాలంటే ఇలాగే ఆడాలి' అని వ్యాఖ్యానించాడు. సిన్నర్ మాత్రం 'అతను నన్ను మించిపోయాడు. నేను చేయగలిగినంత చేశాను కానీ అతను కీలక సమయాల్లో తన స్థాయిని పెంచుకున్నాడు' అని అన్నాడు. అల్కరాజస్ ప్రతి అద్భుత షాట్‌కి ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఒక అద్భుత వాలీ తర్వాత అల్కరాజ్ కూడా స్వయంగా 'వావ్!' అంటూ చిరునవ్వు చిందించాడు. మరోసారి చేసిన ఓవర్‌హెడ్ స్మాష్ స్టేడియంలో హోరెత్తించింది. సిన్నర్ మాత్రం అసహనం వ్యక్తం చేస్తూ రాకెట్‌ను నేలపైకి విసరడం, నిరాశ చూపించడం కనిపించింది. మొత్తంగా, గత రెండు సీజన్లలో సిన్నర్ ఇతర ఆటగాళ్లపై 109-4 రికార్డు ఉన్నా, అల్కరాజ్‌పై మాత్రం 1-7 వెనుకబడి ఉన్నాడు. వింబుల్డన్‌లో ఓడిన తర్వాత, యూఎస్ ఓపెన్‌లో గెలిచి 'నా కెరీర్‌లోనే అత్యుత్తమ టోర్నమెంట్ ఇది' అని అల్కరాస్ ఆనందం వ్యక్తం చేశాడు.

# ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్... నామినీగా మహ్మద్ సిరాజ్

ఐసీసీ తాజాగా ఆగస్టు నెలకు గాను ప్లేయర్ ఆఫ్ ది మంత్ నామినీలను ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ తరఫున పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు చోటు దక్కింది. ఇంగ్లండ్‌తో ఓవల్ స్టేడియం వేదికగా జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లో సిరాజ్ అత్యుత్తమ ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. సిరాజ్‌తోపాటు ఈసారి నామినేట్ అయిన మ్యాట్ హెన్రీ, జేడెన్ ఫాస్ట్ కూడా ఫాస్ట్ బౌలర్స్ కావడం ఆసక్తి రేపుతోంది. ఇక సిరాజ్ గత నెలలో కేవలం ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడిన విషయం తెలిసిందే. కానీ ఈ ఒక్క గేమ్ తోనే అతడు ఐసీసీ దృష్టిలో పడ్డాడు. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లో అతడు 21.11 సగటుతో తొమ్మిది వికెట్లు రాబట్టాడు. ఆ మ్యాచ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా లేని లోటును భర్తీ చేస్తూ బౌలింగ్ విభాగంలో జట్టుకు కీలకంగా నిలిచాడు. రెండు ఇన్నింగ్స్‌లో మొత్తం 46 ఓవర్లు వేసిన అతడు తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లను రాబట్టాడు.


ఇక గత నెలలో జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టు మ్యాచుల సిరీస్‌లో న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మాట్ హెన్రీ 9.12 సగటుతో ఏకంగా 16 వికెట్లు రాబట్టాడు. రెండు పర్యాయాలు ఐదు వికెట్లు చొప్పున తీసి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం కనబరిచాడు. ఈ మ్యాచుల్లో తన సత్తా చాటి.. న్యూజిలాండ్‌కు సిరీస్ దక్కడంలో కీలకపాత్ర పోషించాడు. ఇక పాకిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో వెస్టిండీస్ బౌలర్ జెయిడెన్ సీల్స్ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. 4.1 ఎకానమీ రేటుతో 10 వికెట్లు రాబట్టి పాక్ పతనానికి బాటలు వేశాడు. మూడో వన్డేలో ఏకంగా ఆరు వికెట్ల తీసి వెస్టిండీస్‌కు సిరీస్ సొంతమయ్యేలా కీలకపాత్ర పోషించాడు.




# సిరీస్ గెలిచామనే ఉదాసీనతే తమ ఘోర ఓటమికి కారణం

**సౌతాఫ్రికా హెడ్ కోచ్ శుక్రి కాన్రాడ్ ఆవేదన**

వన్డే క్రికెట్ చరిత్రలోనే సౌతాఫ్రికా అత్యంత ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 54 ఏళ్ల వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత దారుణంగా ఓడిన జట్టుగా సౌతాఫ్రికా చెత్త రికార్డును నమోదు చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఆదివారం జరిగిన ఆఖరి వన్డేలో సౌతాఫ్రికా 342 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. వన్డేల్లో పరుగుల పరంగా ఇంత భారీ తేడాతో ఓడిన జట్టు సౌతాఫ్రికా మాత్రమే. ఈ మ్యాచ్‌లో ఓడినా ఈ సిరీస్‌ను సౌతాఫ్రికా 2-1తో కైవసం చేసుకుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో అసాధారణ ప్రదర్శనతో విజయాన్నందుకొని ఇంగ్లండ్ గడ్డపై 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ గెలుచుకుంది. అలాంటి ఆఖరి వన్డేలో 72 పరుగులకే ఆలౌటైంది. ఈ పరాజయంపై సౌతాఫ్రికా హెడ్ కోచ్ శుక్రి కాన్రాడ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తొలి రెండు వన్డేల్లో గెలిచి ఆఖరి మ్యాచ్‌లో ఘోర పరాజయాన్ని ఎదుర్కోవడం అత్యంత దారుణమని అసహనం వ్యక్తం చేశాడు. సిరీస్ గెలిచామనే ఉదాసీనతే తమ ఘోర ఓటమికి కారణమని చెప్పుకొచ్చాడు. 'ఈ ఘోర పరాజయానికి ఎలాంటి సాకులు లేవు. ఈ రోజు మేము బాగా ఆడలేదు. ఇంగ్లండ్ వంటి టాప్ టీమ్‌తో ఆడేటప్పుడు సరిగ్గా ఆడకపోతే మన బలహీనతలు బయటపడుతాయి. ఆస్ట్రేలియాలో కూడా ఇలాగే జరిగింది. అక్కడ కూడా సిరీస్‌ను 2-0తో గెచుకున్న తర్వాత ఆఖరి వన్డేలో 400 పరుగులకు పైగా సమర్పించుకున్నాం. ఇలాంటి మ్యాచ్‌ల్లో మేము పేలవ ప్రదర్శన చేస్తున్నాం. ఇది ఏమాత్రం అమోదయోగ్యం కాదు. ఈ ఓటమి కొంచెం ఇబ్బందికరంగానే ఉంది. బహుశా మా ఆగాళ్లు సిరీస్ గెలిచామనే ఉదాసీనతో ఆడినట్లున్నారు. ఫీల్డింగ్ కూడా మా స్థాయికి తగ్గట్లు లేదు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌పై ఫోకస్ పెట్టాం. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహకాలను ఈ సిరీస్ నుంచి ప్రారంభిస్తాం. ఈ వన్డే సిరీస్‌లో ఘోర పరాజయం ఎదురైనా.. మాకు అనేక సానుకూలంశాలు ఉన్నాయి. తొలి రెండు మ్యాచ్‌ల్లో అనుభవం లేని ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేశారు.' అని శుక్రి కాన్రాడ్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 414 పరుగులు చేసింది. జోరూట్(100), జాకోబ్ బెతెల్(110) శతకాలతో రాణించారు. అనంతరం సౌతాఫ్రికా 72 పరుగులకే ఆలౌటైంది. జోఫ్రా ఆర్చర్(4/18), ఆదిల్ రషీద్(31/3) సఫారీ పతనాన్ని శాసించారు. బ్రైడన్ కార్స్(2/33) రెండు వికెట్లు పడగొట్టాడు.



# ఓజి కోసం 117 మంది మ్యూజిషన్స్ కసరత్తు

## సంగీత దర్శకుడు తమన్ వెల్లడి



పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ ఓజీ. సుజిత్ డైరెక్షన్‌లో పాన్ ఇండియా గ్యాంగ్ స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శామ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఓజీతో బాలీవుడ్ యాక్టర్ ఇమ్రాన్ హష్మీ టాలీవుడ్ డెబ్యూ ఇస్తున్నాడు. ఈ మూవీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కాగా థమన్ అదిరిపోయే అప్‌డేట్ అందించి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. థమన్‌తోపాటు-117 మంది మ్యుజిషియన్స్ ఓజీ కోసం లండన్‌లోని అబ్బే రోడ్ స్టూడియోలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ రికార్డింగ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్టూడియో ఫొటోను షేర్ చేస్తూ అందరితో పంచుకున్నాడు థమన్. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జెట్ స్పీడ్‌లో కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు విడుదల చేసిన రెండు పాటలను అభిమానులు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. మరోవైపు థర్డ్ సింగిల్ గురించి ఎక్సయిటింగ్‌గా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన అప్‌డేట్ రానుంది. కాగా తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలుకరిస్తుండటం. డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్స్‌పై డీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఓజీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓజీ సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా తెలుగుతోపాటు- పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈనేపథ్యంలో కొన్ని రోజులుగా వరుస అప్‌డేట్‌లు, పోస్టర్లతో సోషల్ మీడియాలో చిత్రబృందం సందడి చేస్తోంది. తాజాగా తమన్ ఓ మ్యూజికల్ అప్‌డేట్ పంచుకున్నారు. ఇప్పటికే ఈ సినిమా కోసం జపాన్ వాయిద్య పరికరం కోటోను ఉపయోగించి బీజీఎం క్రియేట్ చేసినట్లు- తెలిపిన ఆయన తాజాగా మరో పోస్ట్‌తో ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. తమన్ పోస్ట్‌తో హ్యాష్ ట్యాగ్ మరోసారి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇందులో పవన్ (శూశ ఔశశా) ఇప్పటివరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హష్మీ విలన్. శ్రియారెడ్డి, ప్రకాశ్‌రాజ్, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

# చిత్ర పరిశ్రమలో ఎవరి స్వార్థం వారిదే

## కిష్కింధపురి హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్




ఇండస్ట్రీలో మన అనుకునే వాళ్లు ఉండరని ఎవరి స్వార్థం వారిదని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. శ్రీనివాస్ ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం 'కిష్కింధపురి' ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు ఇండస్ట్రీలో స్నేహితులు లేరని తెలిపారు. నేను ఓపెన్‌గా ఉంటాను. మనసులో ఏదో పెట్టుకొని ఇలా మాట్లాడితే, ఆటిట్యూడ్ చూపిస్తే అభిమానులు పెరుగుతారేమోనని ఎప్పుడూ లెక్కలు వేసుకొని మాట్లాడలేదు. 'భైరవం' కంటే ముందు చాలా తక్కువగా మాట్లాడేవాడిని. ఈ మధ్య ఎక్కువగా మాట్లాడుతున్నాను. ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి ఒకేలా ఉన్నాను. మనసులో ఏదైనా ఉంటే నిద్రరాదు.. ఏవేవో ఆలోచనలు వస్తుంటాయి. అందుకే ఓపెన్‌గా ఉంటా. నేను ఎవరి విషయంలోనైనా బాధపడితే వాళ్లకు మొహం మీదే చెప్పేస్తానని ఒప్పుకున్నారు. ఇండస్ట్రీలో ఎవరి స్వార్థం వాళ్లకు ఉంటుంది. మన అనే వాళ్లు ఎవరూ ఉండరు. ఇదొక సముద్రం లాంటిది. లోతు ఎంత అనేది దీనిలో దిగిన వాళ్లకు మాత్రమే తెలుస్తుంది. ఇండస్ట్రీలో కూడా ఫ్రెండ్స్ ఉండి ఉండొచ్చు.. కానీ, బయట ఉన్నంత స్వచ్ఛంగా ఇక్కడ ఉండరు. మనతో బాగుంటారు.. మనం పక్కకి వెళ్లగానే మన గురించి మరోలా మాట్లాడతారు. నేనెప్పుడూ ఎవరి గురించి తప్పుగా మాట్లాడను. చిన్నప్పటి నుంచి అంతే. గాసిప్స్ కూడా విననని అన్నారు. ప్రేక్షకులు థియేటర్‌కి రావడం లేదనేది చాలా మంది చెబుతున్న మాట. కానీ, మంచి సినిమా అయితే కచ్చితంగా వస్తారని నేనెప్పుడూ నమ్ముతా. ఓ మంచి కథతోనే మా 'కిష్కింధపురి' తెరకెక్కింది. ఆద్యంతం ఈ చిత్రం థ్రిల్‌ని పంచుతుంది. దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి అద్భుతమైన కథని రాసుకుని తెరపైకి తీసుకొచ్చారు. థియేటర్లో ఫోన్ చూసుకునే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా ఈ సినిమా థ్రిల్‌ని పంచుతుంది. సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్ ఈ సినిమాకి చాలా ముఖ్యం అన్నారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్.

# అందాల దిశాను చూపిస్తోంది



తెలుగు మూవీ 'లోఫర్'తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ దిశా పటాని. మొదటి సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. అయినా కూడా లక్ కలిసి వచ్చింది. ఎంఎస్ ధోనీ సినిమాలో చిన్న పాత్రలో నటించినప్పటికీ దిశా పటానీకి మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. బాలీవుడ్‌లో మెల్ల మెల్లగా ఆఫర్లు దక్కించుకుంటూ వస్తున్న దిశా పటానీ హీరోయి-న్‌గా టాప్ పొజిషన్‌లో నిలిచింది. తెలుగులో మళ్లీ ఇన్నాళ్లకు కల్కి 2898 ఏడీ సినిమాలో నటించింది. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో టాలీవుడ్‌లో దిశా మరిన్ని సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. దిశా పటానీ హీరోయిన్‌గా కంటే ఎక్కువగా అందాల ఆరబోత ఫోటోల కారణంగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్‌గా దిశా పటానీ బాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ మూడు సినిమాలతో రాబోతుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 61.5 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న దిశా పటానీ ఎప్పుడు ఏ ఫోటో షేర్ చేసినా నిమిషాల్లో లక్షల లైక్స్ రావడం మనం చూస్తూ ఉంటాం. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ దిశా సొంతం అని చాలా సార్లు నిరూపితం అయ్యింది. మరోసారి ఈ ఫోటోలతో దిశా పటానీ తన అందాలను చూపించే ప్రయత్నం చేసింది. ఆకట్టుకునే అందం కారణంగా దిశా పటానీ ఫోటోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా క్యూట్ ఫోటోలను షేర్ చేసిన దిశా పటానీ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైట్ ఔట్ ఫిట్‌లో దిశా చాలా అందంగా కనిపిస్తోంది. అందమైన దిశా లుక్‌ని ఆమె లిప్‌స్టిక్ మరింతగా పెంచింది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత చక్కని రూపం ఉన్న ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



# చెట్టు కింద చదువు నేర్పిన శ్రీ లీల!

శ్రీ లీల.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. కన్నడ బ్యూటీ అయినప్పటికీ తెలుగులో సత్తా చాటుతూ దూసుకుపోతోంది. 'పెళ్లి సంద%ణ%' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈమె.. రవితేజ హీరోగా నటించిన 'ధమాకా' సినిమాతో ఓవర్ నైట్ లోనే భారీ పాపులారిటీ అందుకుంది.. ఆ తర్వాత పలు చిత్రాలలో నటించిన ఈమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. మధ్యలో భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి చిత్రాలు చేసి.. మోస్తారుగా విజయాన్ని అందుకుంది.ప్రస్తుతం తెలుగులో రవితేజతో మరొకసారి మాస్ జాతర అనే సినిమాలో చేస్తున్న ఈమె.. ఇటు పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 7న ఆమె సినిమా షూటింగ్లో కూడా భాగమయ్యారు. ఈ విషయాన్ని రాసి ఖన్నా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించిన విషయం తెలిసిందే. అలాగే మరోవైపు బాలీవుడ్ లో కార్తీక ఆర్యన్ తో ఒక సినిమా చేస్తున్న ఈమె.. అక్కడే మరో ప్రాజెక్టుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అలా తెలుగు, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ బిజీగా మారిన ఈమెకు సంబంధించిన ఒక విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. శ్రీ లీల స్వతహాగా డాక్టర్ అనే విషయం అందరికీ తెలిసిందే. ఒకవైపు నటిస్తూ మరొకవైపు ఎంబిబిఎస్ కూడా పూర్తి చేసింది. అంతేకాదు ఇద్దరు పిల్లలను దత్తత తీసుకొని తన మంచి మనసు చాటుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. అలాంటి ఈమె టీచర్ కూడా అని తెలిసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే అది ఇప్పుడు కాదు అని.. విద్యార్థి దశలో ఉన్నప్పుడే చిన్నపిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు చెప్పిందని సమాచారం. ఇదే విషయంపై ఆమె మాట్లాడుతూ.." నేను చిన్నప్పుడు బెంగళూరులో ఉండేదాన్ని. కానీ వేసవి సెలవులు వస్తే మాత్రం నా స్వస్థలమైన ఒంగోలుకు వెళ్లేదాన్ని. అక్కడ చిన్నప్పుడు మా తాత నాగేశ్వరరావు నిడమానూరి ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకం ఇచ్చేవారు. అయితే పుస్తకంలో ఉన్న ఇంగ్లీష్ నేర్చుకొని చెట్టు కింద పిల్లల్ని పోగేసుకొని వాళ్లకు ఇంగ్లీష్ పాఠాలు చెబుతూ వారికి చదువు చెప్పాను. అలా నాకు చిన్నప్పుడే ఇంగ్లీష్ పై మంచి పట్టు ఏర్పడింది. ముఖ్యంగా ఈ పట్టు రావడానికి కారణం మా తాత ఇచ్చిన ప్రోత్సాహమే. అది ఎప్పటికీ మరువలేనిది" అంటూ శ్రీ లీల తెలిపింది

# మల్లెపూలు గొల్లుమన్నవి

## ఎయిర్‌పోర్టులో నటి నవ్యకు లక్ష జరిమాన



మల్లెపూలు తీసుకెళ్లినందుకు.. ఓ నటికి రూ.1.14 లక్షల జరిమానా విధించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ ఈవెంట్‌కు హాజరయ్యేందుకు మలయాళ నటి నవ్య నాయర్ ఆస్ట్రేలియా వెళ్లారు. ఆ సమయంలో తన బ్యాగులో నవ్య మల్లెపూలను తీసుకెళ్లారు. మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్టులో వాటిని గుర్తించిన సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. అక్కడి అధికారులు ఆమెకు రూ.1.14లక్షల జరిమానా వేశారు. ప్రపంచంలోని అత్యంత కఠినమైన బయోసెక్యూరిటీ- చట్టాలు ఉన్న విమానాశ్రయాల్లో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్టు ఒకటి. ప్రయాణికులు పండ్లు, విత్తనాలు, పూలను తీసుకువెళ్లడం అక్కడ నిషిద్ధం. వాటివల్ల ప్రయాణికులకు వివిధ రకాల వ్యాధులు, తెగుళ్లు సులభంగా వ్యాపించే అవకాశం ఉండడంతో ఈ నిబంధన పెట్టారు. నవ్య మెల్‌బోర్న్ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం అక్కడి కస్టమ్స్ అధికారులు ఆమె బ్యాగ్‌లో మల్లెపూలును తీసుకువచ్చినందుకు జరిమానా విధించడంతో నటి లక్ష రూపాయలు చెల్లించింది. అనంతరం మెల్‌బోర్న్‌లో జరిగిన ఓనం కార్యక్రమంలో నటి నవ్య తనకు ఎదురైన అనుభవాన్ని చెప్పడంతో ఈ విషయం బయటకు వచ్చింది. తాను తీసుకువచ్చిన పూలు లక్ష రూపాయలు ఖరీదైనవని జరిమానా విధించేవరకు తనకు తెలియదని చమత్కరించింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**